RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ ఆయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 236 పేజీలు - 08 బుధవారం 22 జులై 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక





- కాంగ్రెస్ ధర్నాతో స్వల్ప ఉద్రిక్తత
- బలవంతంగా అరెస్ట్ చేసి తరలించిన పోలీసులు
- రాహుల్ సహా కాంగ్రెస్ నేతల అరెస్ట్

# ప్రధాని నివాసం వద్ద కాంగ్రెస్ మెరుపు ధర్నా

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,జూలై 21:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నివాసం ముందు ఆందోళన చేసిన రాహుల్ గాంధీ.. కాంగ్రెస్, మిత్రపక్షాల ఎంపీలను పోలీసులు మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌కి తరలించారు. మందిర్ మార్గ్ పోలీసు స్టేషన్‌లో ఉన్న ఎంపీలను కలిసేందుకు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్ పర్సన్ సోనియా గాంధీ వెళ్లారు. అయితే, పోలీసులు సోనియాగాంధీని లోపలికి అనుమతించలేదు. భారత ప్రధాని నరేంద్ర మోదీ నివాసం దగ్గర కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ధర్నా చేపట్టారు. సోమవారం జంతర్‌మంతర్ వద్ద నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌కు నిరసనగా చేపట్టిన ఈ ధర్నాలో రాహుల్‌తో పాటు ఖర్గే, కేసీ, ప్రియాంక, పలువురు కాంగ్రెస్, మిత్ర పక్షాల ఎంపీలు పాల్గొ న్నారు. కాంగ్రెస్ మిగతా2లో...

# వైభవంగా బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవం

- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు
- ఉత్సవానికి హాజరైన సిఎం సతీమణి



**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 21:** బల్కంపేట ఎల్లమ్మ తల్లి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారికి మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్.. ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. కళ్యాణోత్సవానికి సిఎం రేవంత్ సతీమణి కూతురుతో కలిసి హాజరయ్యారు. అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. మాజీమంత్రి తలసాని కూడా హాజరయ్యారు. వీరి రాకతో పకడ్బందీగా మిగతా2లో...

# ఎల్‌నినో సవాళ్లపై పక్కా ప్రణాళికలు

- సాగు,తాగునీటి సవాళ్లను ఎదుర్కొనేలా చర్యలు
- డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క వెల్లడి



**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 21:** ఎల్ నినో సవాళ్లను ఎదుర్కొనేందుకు తెలంగాణ సర్కార్ పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఎల్ నినోపై రాష్ట్రస్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ రంగాలపై ఈ ప్రభావాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ప్రతి గ్రామంలో ఎల్ నినోపై అవగాహన కల్పించడమే ఈ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రైతులకు తక్కువ మిగతా2లో...



# సన్న వడ్ల కుంభకోనం గతంలో జరిగిందేమో

**ఈ ప్రభుత్వంలో అలాంటిదేమీ జరగలేదు**

**హరీష్ రావు తదితరుల విమర్శలకు మంత్రి ఉత్తమ్ కౌంటర్**

**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 21:** ఈ ప్రభుత్వంలో సన్న వడ్ల కుంభకోణం అనేది అవాస్తవమని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. దీనిపై మీడియా - సోషల్ మీడియాలో వస్తున్న వార్తల్లో నిజం లేదని అన్నారు. కొందరు కావాలని సన్న వడ్ల కుంభకోణం అంటూ తప్పుడు ప్రచారం మిగతా2లో...

# ఎల్‌నినో ప్రభావంతో ప్రభుత్వం అప్రమత్తం

- ప్రత్యామ్నాయ ప్రయత్నాల్లో ఉన్నాం
- వర్షాభావాన్ని ఎదుర్కొనేందుకు సమిష్టిగా కృషి
- కంటింజెన్సీ ప్రణాళికలను అమలు చేయాలి
- హన్మకొండ కలెక్టరేట్‌లో సమీక్షించిన మంత్రి పొంగులేటి



**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 21:** రాష్ట్రంలో ఎల్‌నీనో ప్రభావంతో సాధారణం కంటే వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

మిగతా2లో...

# దేశ యువత కోసం రాహుల్ పోరాటం

- ఎక్స్ వేదికగా సిఎం రేవంత్ రెడ్డి పోస్ట్


2లో



# ఉద్యమకారులకు వెంటనే న్యాయం చేయండి

**కెకె కమిటీకి నివేదిక అందించిన కవిత**

**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 21:** ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం కోసం పోరాడిన ఉద్యమకారులకు న్యాయం చేసే విషయంలో ఆలస్యం చేయవద్దని తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీకి టీఆర్‌ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. ఉద్యమకారులకు న్యాయం చేయాలంటూ కవిత రూపొందించిన నివేదికను ఆ కమిటీకి మంగళవారం ఆమె అందజేశారు. అనంతరం ట్యాంక్ బండ సమీపంలోని అమరజ్యోతి వద్ద ఆమె మాట్లాడుతూ.. మిగతా2లో...

# జిహెచ్‌ఎంసి ఎన్నికల కోసమే ఇళ్ల నాటకం

**ప్రజల నుంచి పదివేల కోట్లు వసూళ్లకు పన్నాగం**

**భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శలు**


2లో




# రైతులను ఆరుతడి పంటలవైపు మళ్లించాలి

**ఎల్‌నినోతో వర్షాభావంపై అధికారులతో చర్చలు**

**కార్యాచరణతో ముందుకు**

**సాగాలని స్పీకర్ ప్రసాద్ కుమార్ ఆదేశం**

**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 21:** ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి వచ్చే అవకాశం ఉన్నందున రైతులను పండ్ల తోటలు, అరుతడి పంటల వైపు మళ్లించాలని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధికారులకు సూచించారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో మిగతా2లో...



2లో

# కాళేశ్వరంపై ఇన్ని అబద్ధాలా?

**నీళ్లు కిందికి పోతున్నా పట్టింపు లేదా..?**

**దేవాదుల విషయంలోనూ అదే ద్రోహం**

**రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్**

**మీడియా సమావేశంలో మండిపడ్డ హరీష్ రావు**

# ప్రధాని నివాసం వద్ద కాంగ్రెస్ మెరుపు ధర్నా

(మొదటి పేజీ తరువాయి)

నేతలు చేతులకుసంకెళ్లు వేసుకుని నిరసన తెలిపారు. ఈ నిరసనలు ఉద్రిక్తతకు దారి తీయటంతో పోలీసులు బలవంతంగా వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రాహుల్, ఖర్గే, ప్రియాంకలను అరెస్ట్ చేసి బలవంతంగా తరలించారు. ఇకపోతే మంగళవారం ఈ నిరసనలు పొలిటికల్ టర్న్ తీసుకున్నాయి. కాంగ్రెస్ నేతలు ప్రధాని నరేంద్రమోడీ నివాసం ముందు ధర్నా చేశారు. కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ, మల్లికార్జున ఖర్గే, కర్ణాటక, కేరళ సీఎంలు డీకే శివకుమార్, సతీషన్‌లు కూడా ఈ ధర్నాలో పాల్గొన్నారు. విద్యార్థులపై దాడికి నిరసనగా ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని పిలుపునిచ్చారు. అయితే కాంగ్రెస్ ధర్నా చేసిన ప్రాంతాన్ని పోలీసులు ఖాళీ చేయించారు. రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీను అదుపులోకి తీసుకున్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, కర్ణాటక, కేరళ సీఎంలు డీకే శివకుమార్, సతీషన్‌తో పాటు ఇతర కాంగ్రెస్ ముఖ్య నేతలను పోలీసులు అదుపులోకి తీసుకొని బస్సుల్లో తరలించారు. రాహుల్ గాంధీ, ప్రియాంకను పోలీసులు వేర్వేరు స్టేషన్లకు తరలించారు. ఈ క్రమంలో మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌లో వున్న ప్రియాంకా గాంధీ వాద్రాను కలిసేందుకు కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ అక్కడికి చేరుకున్నారు. తొలుత ఆమెను లోపలికి పంపేందుకు పోలీసులు నిరాకరించారు. ఆ తర్వాత కాసేపటికి లోపలికి పంపడంతో ప్రియాంకను ఆమె కలిశారు. ఇదిలా ఉండగా.. రాహుల్‌ను మోడల్ టౌన్‌లోని ఛత్రసాల్ స్టేడియానికి పోలీసులు తరలించినట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు. అంతకుముందు కాంగ్రెస్ ధర్నా వద్దకు వచ్చిన కేంద్ర సహాయ మంత్రి, ప్రధాని కార్యాలయ బాధ్యతలు చూస్తున్న జితేంద్ర సింగ్, కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్.. రాహుల్‌తో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా కేంద్రం ముందు రాహుల్ ప్రధానంగా రెండు డిమాండ్లు ఉంచారు. ఎట్టిపరిస్థితుల్లో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నిన్న విద్యార్థులపై లాఠీఛార్జి చేసిన ఘటనపై పార్లమెంటు ఉభయ సభల్లో కేంద్రం స్పందించాల్సిందేనని పట్టుబట్టారు. ఈ విషయంలో ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వచ్చే వరకు తాము ఈ ఆందోళనలు ఆపేది లేదని, ఇక్కడి నుంచి కదిలేది లేదని రాహుల్ తేల్చి చెప్పారు. ఆ తర్వాత ఢిల్లీ పోలీసులతో పాటు ఆర్‌పీఎఫ్, ఆర్ఏఎఫ్ బలగాలు భారీగా మోహరించి ప్రధాని నివాసం ముందు ధర్నా చేస్తున్న నేతలందరినీ అదుపులోకి తీసుకోవడంతో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. డిమాండ్లపై రాహుల్ మాట మార్చారని కేంద్రమంత్రి జితేంద్రసింగ్ విమర్శించారు. రాహుల్ సహా కాంగ్రెస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకోకముందు మీడియాతో ఆయన మాట్లాడారు. 'నీట్ అంశంపై లోక్‌సభలో చర్చించాలని తొలుత రాహుల్ కోరారు. దానిపై హామీ ఇస్తే ధర్నా విరమిస్తామన్నారు. పార్లమెంట్‌లో చర్చిస్తామని హామీ ఇచ్చాం. ఇప్పుడు మాట మార్చి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతున్నారు. ప్రతిపక్ష నేత హోదాలో ఇలా మాట మార్చడం సరికాదు. రాహుల్ ప్రవర్తన, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. యాగీ చేయడమే ఆయన ఉద్దేశం. రాజకీయ లబ్ది కోసమే రాహుల్ ప్రయత్నిస్తున్నారు. మా ప్రభుత్వం యువతకు అన్యాయం చేయదు'అని జితేంద్రసింగ్ అన్నారు.

# జిహెచ్ఎంసి ఎన్నికల కోసమే ఇళ్ల నాటకం

**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 21:** జీహెచ్ఎంసీ ఎన్నికలు వస్తున్నాయనే ఇళ్ల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం నాటకం ఆడుతోందని బిజెపి దుయ్యబట్టింది. 7వేల ఇళ్లకు 10వేల దరఖాస్తులు వస్తాయి. ఒక్కో దరఖాస్తుకు రూ.10వేల చొప్పున తీసుకుంటే ప్రభుత్వానికి రూ.వెయ్యికోట్ల రాబడి వస్తుందని, క్యూర్ పేరుతో ప్రజలకు ప్రభుత్వం పెయిన్ తెస్తోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఎద్దేవా చేశారు. నాంపల్లిలో భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

క్యూర్‌లో శాస్త్రీయ బద్ధమైన పన్నుల విధానం లేదు. ట్యాక్స్ దోపిడీతో ప్రజలపై భారం పడుతుంది. ఈ చట్టాన్ని రెసిడెన్షియల్ అసోసియేషన్లు వ్యతిరేకిస్తున్నాయి. ఇది సరైన చట్టం కాదు. ఎవరితోనూ చర్చించకుండా దీన్ని అమలు చేస్తున్నారు. రాజీవ్ స్వగృహ పేరుతో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో నిర్మించిన ఇళ్లు అలాగే ఉన్నాయి. వాటికి మరమ్మతులు చేసి పేదలకు ఇవ్వాలి. క్యూర్‌పై వచ్చిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్నాకే చట్టాన్ని అమలు చేయాలన్నారు. రూ.వెయ్యి కోట్ల కోసం పేదల నుంచి రూ.10వేలు తీసుకోవడం సరికాదని రామచందర్‌రావు అన్నారు.

# రైతులను ఆరుతడి పంటలవైపు మళ్లించాలి

(మొదటి పేజీ తరువాయి)

ఎల్‌నినో ప్రభావంపై ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం తీవ్రత ప్రజలపై పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి వచ్చే పంటలపై దృష్టి పెట్టాలని అన్నారు. రైతులను తక్కువ నీరు అవసరమయ్యే పంటలు, పండ్ల తోటలు, అరుతడి పంటలు సాగు చేసేందుకు ప్రోత్సహించాలని సూచించారు. ఈ దిశగా వ్యవసాయ, ఉద్యాన అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీటికి ఎలాంటి ఇబ్బంది రాకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. వ్యవసాయ, పాడి పరిశ్రమలకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. ఎల్‌నినో బారిన ప్రజలు పడకుండా చూసే బాధ్యత పూర్తిగా జిల్లా యంత్రాంగంపైనే ఉందని స్పీకర్ స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రత్యామ్నాయ ప్రణాళికలు అమలు చేయాలని, అవసరమైన చోట నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. కార్యక్రమం చివరలో వర్షపు నీటి సంరక్షణ కు సంబందించిన తెలంగాణ జలసిరి పోస్టర్ విడదల చేశారు. ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, చేవెళ్ల ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, శంకర్, కాలే యాదయ్య ఇంకా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వివిధ విభగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# కాళేశ్వరంపై ఇన్ని అబద్ధాలా?

**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 21:** కాళేశ్వ రం దగ్గర చిల్లర రాజకీయం చేయడంపై సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు మండిపడ్డారు. మరి దేవాదుల దగ్గర నీకు ఏం అడ్డమొచ్చిందని ప్రశ్నించారు. దేవాదుల విషయంలో నాటి నుంచి నేటి దాకా కాంగ్రెస్ పార్టీది ద్రోహమే అని మండిపడ్డారు. 2011లో మూడేళ్లు దేవాదులను మూలకు పడేసిందే కాంగ్రెస్ పార్టీ అని గుర్తుచేశారు. ఎల్‌నినో పేరు చెప్పి ఎగనామం పెడితే బీఆర్ఎస్ ఊరుకోదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి బొట్టును ఒడిసి పట్టాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డికి ఉందని అన్నారు. మాట్లాడితే తిట్లు, ఒట్లు తప్ప ఏమీ లేదని మండిపడ్డారు. మొన్న రాములోరి మీద కూడా ఒట్టు పెట్టిండు అని తెలిపారు. ఒట్ల మీద ఉన్న శ్రద్ధ.. నీటి బొట్ల మీద పెట్టాలని హితవుపలికారు. లేదంటే చరిత్రహీనుడిగా మిగిలిపోవడం ఖాయమని హెచ్చరించారు. నీళ్లు రాకున్నా.. కరెంటు లేకున్నా రేవంత్ రెడ్డిదే బాధ్యత అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. జూన్ 1 నుంచి నేటి వరకు సమ్మక్క బ్యారేజీ నుంచి 105 టీఎంసీల నీరు కిందకు పోయిందని తెలిపారు. నీళ్లన్నీ ఆంధ్రాకు తరలిపోయాయని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం 1.9 టీఎంసీలు మాత్రమే ఎత్తిందని చెప్పారు. నాలుగు రోజులకు ఒక టీఎంసీ ఎత్తవచ్చని.. 50 రోజులకు 12 టీఎంసీలు ఎత్తే అవకాశం ఉందని తెలిపారు. కానీ కనీసం రెండు టీఎంసీలు కూడా ఎత్తలేదని విమర్శించారు. ఇది నేరపూరిత నిర్లక్ష్యం కాదా అని ప్రశ్నించారు. నీ ప్రభుత్వానికి ఏం శిక్ష వేయాలో నువ్వే చెప్పు అని సీఎం రేవంత్ రెడ్డిని నిలదీశారు. ఇన్ని నీళు ఉంటే ఎత్తవా అని మండిపడ్డారు. ఇదేనా రైతులపై నీకు ఉన్న చిత్తశుద్ధి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్న దేవాదులను నిర్వహించే సత్తా మీకు లేదా అని అడిగారు. మీ వైఫల్యం వల్ల వరంగల్ జిల్లా వ్యవసాయ సంక్షోభంలో మునిగిపోయిందని అన్నారు.



వరంగల్, కరీంనగర్ జిల్లాలు ఆగమయ్యే పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ సర్కార్ వైఫల్యమే అని ఆరోపించారు. 22 రిజర్వాయర్ల కెపాసిటీ 12 టీఎంసీలు అని.. ప్రతిరోజు పావు టీఎంసీ ఎత్తవచ్చని తెలిపారు. అంటే ఇప్పటికి 12 టీఎంసీలు ఎత్తిపోయవచ్చని పేర్కొన్నారు. మరెందుకు 22 రిజర్వాయర్లు నింపలేదని ప్రశ్నించారు. దేవాదుల నుంచి 105 టీఎంసీలు కిందకు తరలిపోయాయని తెలిపారు. ఈ రోజు కూడా దేవాదులలో 78 మీటర్ల ఎత్తులో నది ప్రవహిస్తున్నదని పేర్కొన్నారు. 73 మీటర్లు ఉంటే చాలు మోటార్లు నడుస్తాయని.. 78 మీటర్లు ఉన్నప్పటికీ మోటార్లు నడిపించడం లేదని చెప్పారు. ఎందుకు నీళ్లు ఎత్తిపోయడం లేదని, ఏమిటీ నిర్లక్ష్యమని ప్రశ్నించారు. అతి తక్కువ వర్షపాతం పడిన జిల్లా వరంగల్ జిల్లా అని హరీశ్‌రావు తెలిపారు. రెయిన్‌ఫాల్ తక్కువ ఉంటే సమ్మక్క బ్యారేజీ నుంచి నీళ్లు ఎత్తడం లేదని పేర్కొన్నారు. ఎందుకు నీళ్లను కిందకు జారవిడుస్తున్నారని ప్రశ్నించారు. మేం ప్రెస్‌మీట్ పెట్టగానే.. దేవాదులలో రెండు మోటార్లు స్టార్ట్ చేశారని తెలిపారు. మేం ప్రశ్నిస్తే తప్ప నీళ్లు ఎత్తిపోయారా అని నిలదీశారు. ప్రధాన ప్రతిపక్షంగా రైతుల పక్షాన బాధ్యతాయుత పోరాటం చేస్తున్నామని మండిపడ్డారు. దేవాదుల ప్రాజెక్టులో 10 మోటార్లు స్టార్ట్ చేసి సాగునీటిని అందిస్తామని ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పిన మాటలు నమ్మి రైతులు నారుమడులు పోసుకున్నారని తెలిపారు. ఇప్పుడేమో నీళ్లు ఎత్తడం లేదని పేర్కొన్నారు. వరంగల్ జిల్లా కలెక్టర్ మాత్రం నీళ్లు ఇవ్వమని చెబుతున్నాడని అన్నారు. మంత్రులది ఒక మాట.. కలెక్టర్‌ది ఒక మాట ఉంటుందా అని మండిపడ్డారు. ప్రపంచమంతా నీళ్లను కాపాడుకుంటే.. మీరు వృథా చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. పాకాల ప్రాజెక్టు కింద 29వేల ఎకరాల ఆయకట్టు ఉందని తెలిపారు. కాంగ్రెసోళ్ల మాటలు నమ్మి అక్కడి రైతులు నాట్లు వేసుకున్నారని, రామప్ప కింద కూడా నాట్లు వేసుకున్నారని పేర్కొన్నారు. రామప్ప కింద 5500 ఎకరాల ఆయకట్టు ఉందని తెలిపారు. నిన్న పాకాల కింద తూములు మూసేశారని పేర్కొన్నారు. నమ్మి నాట్లు వేసుకున్న రైతుల పరిస్థితి ఏంటి అని నిలదీశారు. మంత్రులది ఒక మాట.. కలెక్టర్‌ది ఒక మాట ఉంటుందా అని హరీశ్‌రావు మండిపడ్డారు. రామప్ప కింద తూములు మూసేస్తే రైతుల పరిస్థితి ఏంటని నిలదీశారు. నీళ్లు ఎత్తకుండా కలెక్టర్ ఎందుకు తూములు మూసేయమని చెప్పాడని ప్రశ్నించారు. మంత్రులు చెప్పింది తప్పయితే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. క్రాప్ హాలీడే ప్రకటించి, రైతులకు డబ్బులు ఇవ్వాలన్నారు. పంటను కాపాడుకోవడానికి రైతులు అష్టకష్టాలు పడతారని హరీశ్‌రావు తెలిపారు. వాటర్ ట్యాంకర్ల ద్వారా నీళ్లు పోసి నార్లు కాపాడుకుంటున్నారని పేర్కొన్నారు. బిందెలు, సీసాలతో పత్తికి బొట్టు బొట్టు నీళ్లు జల్లుకుంటున్నారని చెప్పారు. రైతులకు ఉన్న తపన, సోయి రేవంత్ రెడ్డికి లేదా అని మండిపడ్డారు. నీళ్ల కోసం తెలంగాణ రైతులు ఎంతో తపన పడుతున్నారని తెలిపారు. నీళ్ల ఎత్తిపోతల విషయంలో కూడా వాయిదాలు ఎందుకు అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి లేక నీళ్లు కిందకు విడిచిపెడుతున్నాడని మండిపడ్డారు.

# దేశ యువత కోసం రాహుల్ పోరాటం

**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 21:** యువత భవిష్యత్ కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఢిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జ్‌కి బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రధాని నివాసం వద్ద ధర్నా చేపట్టారు. ఈ ఆందోళనకు మద్దతు తెలుపుతూ సీఎం రేవంత్‌రెడ్డి 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంకా గాంధీ మద్దతుగా నిలిచారని చెప్పారు. యంగ్ ఇండియాకు కాంగ్రెస్ అండగా ఉంటుందని సీఎం పేర్కొన్నారు.

# వైభవంగా బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవం

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాట్లు చేశారు. కల్యాణం అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. అమ్మవారి కల్యాణం ఘనంగా జరిగిందన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు లక్షల మంది భక్తులు తరలివచ్చారన్నారు. ప్రత్యేక సమీక్షలు చేసి, ఇచ్చిన ఆదేశాలతో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పట్లు చేయడంతో ఘనంగా కల్యాణం జరిగిందని తెలిపారు. వికలాంగులు, జోగినిలకు ప్రత్యేక క్యూ లైన్స్ ఏర్పాటు చేయడంతో తోపులాట, తొక్కిసలాట జరగలేదన్నారు. జోగినిలకు ప్రాముఖ్యం ఇవ్వడంతో పాటు వారు తెచ్చిన పట్టువస్త్రాలను అమ్మవారికి చేరవేశామని.. వారిని గ్యాలరీలో తమతో సమానంగా కూర్చునేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. రాష్ట్రంలో వర్షాల కోసం వరుణయాగం జరుగుతోందన్నారు. నిజాం కాలం నుంచి అమ్మవారికి ప్రాముఖ్యం ఉందన్నారు. అమ్మవారిని దర్శించుకొంటే కోరికలు నేరవేరుతాయని నమ్మకమని చెప్పారు. బోనాల ఉత్సవాల కోసం ప్రభుత్వం బ్జడెట్ కేటాయించిందని అన్నారు. ఖర్చుల కోసం దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయాలకు బడ్జెట్ కేటాయించామని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. మహిమగల బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం.. లోకకల్యాణం కోసం ఘనంగా జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# ఎల్‌నినో సవాళ్లపై పక్కా ప్రణాళికలు

(మొదటి పేజీ తరువాయి)

నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. పగటి పూట సోలార్ విద్యుత్ వినియోగం పెంచి ఆర్థిక భారం తగ్గిస్తామని చెప్పారు. ఎల్ నినో కారణంగా వర్షాకాలం లోనూ వేసవిలో ఉన్నంత విద్యుత్ డిమాండ్ ఉందని వివరించారు. గ్రిడ్ స్థిరత్వానికి స్మార్ట్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాల వారీగా కూడా ఎల్ నినో అవగాహన సదస్సులు నిర్వహించాలనిఉన్నతాధికారులను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు.

# ఉద్యమకారులకు వెంటనే న్యాయం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

స్వతంత్ర సైనిక సమ్మాన్, హైదరాబాద్ లిబరేషన్ మూమెంట్ రూల్ పొజిషన్‌ను స్టడీ చేయాలని ఈ సందర్భంగా ఆ కమిటీకి సూచించారు. వాటిలో ఉన్న విధంగా ఉద్యమకారులకు ప్రయోజనం కలిగించాలని స్పష్టం చేశారు. కేకే కమిటీ అంటే కాలయాపన కమిటీ అనే భావన ఉంది.. అది తప్పని నిరూపించాలని ఆ కమిటీ చైర్మన్‌తో ఆమె పేర్కొన్నారు. ఉద్యమకారుల కోసం బీఆర్ఎస్‌లో అంతర్గతంగా పోరాటం చేసి బలైన వ్యక్తిని తానని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తన సూచనలు, సలహాల ద్వారా ఉద్యమకారులకు కొంత మేలు జరిగితే తన జన్మ ధన్యమైనట్లేనని టీఆర్ఎస్ చీఫ్ కవిత తెలిపారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం కోసం పోరాడిన ఉద్యమకారులను గుర్తించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి చైర్మన్‌గా కె. కేశవరావును నియమించింది.

# సన్న వడ్ల కుంభకోనం గతంలో జరిగిందేమో

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో ఈ కుంభకోణం జరిగి ఉండవచ్చని ఆరోపించారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి పని పారదర్శకంగా జరుగుతుందని వివరించారు. ధరలు పెంచి టెండర్ కోడ్ చేస్తే.. ఎవ్వరూ ముందుకు రాలేదని అన్నారు. అందుకే మళ్ళీ పిలిచారని తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటిపారుదలలో ఎక్స్‌పర్ట్ అయితే.. హరీశ్‌ను మంత్రి పదవి నుంచి కేసీఆర్ ఎందుకు తొలగించారంటూ ఉత్తమ్ కుమార్ రెడ్డి సందేహం వ్యక్తం చేశారు. ముందు టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పాలంటూ హరీశ్ రావుకు సూచించారు. దేవాదులలో 7 పంపులు నడుస్తున్నాయని.. నేడు మరో రెండు అందుబాటులోకి వస్తాయని అన్నారు. రూ.14 వందల కోట్ల సంగతి ఏమిటో ముందు సమాధానం చెప్పాలంటూ హరీశ్ రావును మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.

# ఎల్‌నినో ప్రభావంతో ప్రభుత్వం అప్రమత్తం

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం హనుమకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర రవాణా / బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలసి ఎల్‌నీనో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, కంటింజెన్సీ ప్రణాళికల అమలుపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎల్‌నీనో పరిస్థితుల నేపథ్యంలో వర్షాభావ ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, కంటింజెన్సీ ప్రణాళికలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్షాభావ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రతి ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక అధికారులను నియమించగా, ఉమ్మడి వరంగల్ జిల్లాకు సీనియర్ ఐఏఎస్ అధికారి దేవసేనను నియమించినట్లు తెలిపారు. వ్యవసాయం, తాగునీటి లభ్యత, భూగర్భ జలాలు, వర్షాభావ పరిస్థితులపై ప్రత్యేక అధికారులు నివేదికలు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తారని చెప్పారు. సమగ్ర నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించి అవసరమైన సహాయం కోరనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వరి, పత్తికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగు చేయగల పంటలపై వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు. కోతుల బెడద నివారణ చర్యలపైనా రైతులకు సూచనలు ఇవ్వాలని అన్నారు.దేవాదుల ప్రాజెక్టు మోటార్లు ప్రతిరోజూ పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, ఏదైనా లోపం తలెత్తితే 24 గంటల్లో మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. దేవాదుల ద్వారా తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన నిధులను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. దేవాదుల, సాగునీటిపారుదల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఈ సమన్వయాన్ని ములుగు జిల్లా కలెక్టర్ పర్యవేక్షించాలని సూచించారు.

# బాలవికాస ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం






**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) జూలై 21:** బాలవికాస సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మెడికేర్ హాస్పిటల్,హన్మకొండ లక్ష్మీనరసింహ ఆస్పటల్ లుమినస్ ల సహకారంతో మండలంలోని వెలికట్ట, చీకటయపాలెం గ్రామాలలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచ్ లు బందు శ్రీనివాస్, చిదురాల కృష్ణమూర్తి లు మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని,ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. వెలికట్టలో 150 మంది, చీకటయపాలెంలో 180 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసిన హాస్పటల్ ల నిర్వాహకులు,బాల వికాస సంస్థకి కృతజ్ఞతలు తెలియజేశారు.డాక్టర్ కోట నరేష్, డాక్టర్ తేజస్విని, డాక్టర్ సంకీర్తన లు మాట్లాడుతూ మహిళలు అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ప్రతి ఒక్కరు తప్పనిసరిగా షుగర్,బీ.పి పరీక్షలు చేయించుకోవాలన్నారు, దాని వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అన్నారు,ఈ కార్యక్రమంలో హాస్పిటల్ మేనేజ్మెంట్ యన్, రాము, సిబ్బంది, కీర్తి, శిరీష, బాల వికాస మెయిన్ కో ఆర్డినేటర్ ఎం. రమా, కోఆర్డినేటర్లు ఎం. సరిత, జె. శైలజ, ఎం శోభారాణి, ఉప సర్పంచ్ సరస్వతి శంకర్, పంచాయతీ కార్యదర్శులు శ్రీకాంత్, కృష్ణ స్వామి,కారోబార్ బి.రమేష్ చందర్, మాజీ సర్పంచ్ కె, దామోదర్, లింగారావు బాలకృష్ణ కనుకుంట్ల కుమారస్వామి,ఈ. ప్రమీల, కె.పద్మ, సిబ్బంది బిక్షపతి, కృష్ణవేణి, ప్రసన్న,భారతి,రాజేష్, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# ఆరెగూడెం గ్రామంలో సీసీ కెమెరాల ప్రారంభోత్సవం

### అడిషనల్ ఎస్పీ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా ప్రారంభం

### గ్రామ భద్రతకు మరింత భరోసా





**తొలి అక్షరం/చౌటుప్పల్ , జూలై 21:** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని ఆరెగూడెం గ్రామంలో వివిఆర్ ఆర్గానిక్ యాజమాన్యం సౌజన్యంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను మంగళవారం యాదాద్రి భువనగిరి అడిషనల్ ఎస్పీ లక్ష్మీనారాయణ గారు ప్రారంభించారు.ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాలు, దొంగతనాలు, ఇతర అవాంఛనీయ సంఘటనలను సమర్థవంతంగా అరికట్టవచ్చని తెలిపారు. సీసీ కెమెరాలు గ్రామ భద్రతను మరింత బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని, ప్రజలు ఎలాంటి భయాందోళనలు లేకుండా నిర్భయంగా జీవించవచ్చని అన్నారు.గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన వివిఆర్ ఆర్గానిక్ యాజమాన్యాన్ని అలాగే గ్రామ సర్పంచ్ ఎన్నెపెల్లి ధనలక్ష్మి వెంకట్ రెడ్డి గారిని అడిషనల్ ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.అనంతరం స్థానిక పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి, వాటికి నీరు పోసి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ డీఎస్పీ మధుసూదన్ రెడ్డి, సీఐ మన్మధ్ కుమార్, గ్రామ సర్పంచ్ ఎన్నెపెల్లి ధనలక్ష్మి వెంకట్ రెడ్డి, ఉపసర్పంచ్ నిర్మల సూర్యనారాయణ, చౌటుప్పల్ ఎస్సై నర్సిరెడ్డి, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, పోలీసు సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది,గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వీవీఆర్ గార్డెన్స్‌లో ఆంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమం

### డ్రగ్స్‌కు దూరంగా ఉంటేనే యువతకు ఉజ్వల భవిష్యత్తు సీఐ జి. మన్మధ్ కుమార్

### ముఖ్య అతిథులుగా యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు ఎస్పీ , చౌటుప్పల్ డి.ఎస్.పి




**తొలి అక్షరం/చౌటుప్పల్, జూలై 21:** యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు ఎస్పీ, చౌటుప్పల్ డీఎస్పీ, ఆదేశాలు, మార్గదర్శకత్వంలో చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి. మన్మధ్ కుమార్ గారి ఆధ్వర్యంలో వీవీఆర్ గార్డెన్స్‌లో విద్యార్థులు, యువత కోసం ఆంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాల వినియోగం వల్ల యువత ఆరోగ్యం, విద్య, కుటుంబ జీవితం, సామాజిక భవిష్యత్తు తీవ్రంగా దెబ్బతింటుందని వివరించారు. క్షణిక ఆనందం కోసం మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితాంతం నష్టపోవాల్సి వస్తుందని హెచ్చరించారు.యువత చెడు వ్యసనాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, తమ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. అలాగే ఎక్కడైనా డ్రగ్స్‌కు సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలు కనిపించినా, మత్తు పదార్థాల విక్రయం లేదా వినియోగంపై సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ప్రజల సహకారంతోనే డ్రగ్స్ నిర్మూలన సాధ్యమవుతుందని తెలిపారు.వీవీఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమంలో వందలాది మంది విద్యార్థులు, యువత ఉత్సాహంగా పాల్గొని డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని, సమాజంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు తమ వంతు సహకారం అందిస్తామని ప్రతిజ్ఞ చేశారు.“డ్రగ్స్‌కు NO చెప్పండి… ఆరోగ్యకరమైన, సురక్షితమైన భవిష్యత్తుకు YES చెప్పండి“ అనే సందేశంతో కార్యక్రమం ముగిసింది.

# అమెరికాతో వ్యవసాయ స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలి

### • కిసాన్ సంయుక్త మోర్చా (ఎస్ కేయం) ఆధ్వర్యంలో తొర్రూర్‌లో ఒప్పంద పత్రాల దగ్ధం...



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) జూలై 21:** అమెరికాతో కేంద్ర ప్రభుత్వం కుదుర్చుకున్న వ్యవసాయ వాణిజ్య ఒప్పందాన్ని వెంటనే రద్దు చేసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్కేయం నాయకులు తొర్రూర్ లో ధర్నా నిర్వహించడం జరిగింది. మంగళవారం తొర్రూరు మండలం కేంద్రంలో గాంధీ సెంటర్లో ఎస్ కే ఎమ్ ఆధ్వర్యంలో అమెరికా స్వేచ్ఛ వాణిచ్చే ఒప్పంద పత్రాలను దగ్ధం చేయడం జరిగింది. అనంతరం ఎస్కేయం నాయకులు , బొల్లం అశోక్ ,ముంజపెల్లి వీరన్న, ఆలకుంట్ల సాయిలు, గణపురం లక్ష్మణ్ ,కొత్త వెంకట్ రెడ్డి లు సంయుక్తంగా మాట్లాడుతూ, భారతదేశ వ్యవసాయ రంగాన్ని సర్వనాశనం చేసే విధంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తో భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం చేసుకున్న స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు అన్నిటిని యూరోపియన్ యూనియన్ తో చేసుకున్న చీకటి అసమాన ఒప్పందాలను వెంటనే రద్దు చేసుకోవాలని రైతు, కూలీలను కాపాడుకుందాం అని వారు అన్నారు. ఈ ప్రమాదకరమైనటువంటి స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాల వల్ల చిన్న సన్నకారు రైతులు వ్యవసాయ కూలీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. భారతదేశం వ్యవసాయక దేశం వ్యవసాయంపైనే ఆధారపడి కోట్లాది కుటుంబాలు జీవిస్తున్నాయని వారి జీవనం మనుగడకు దెబ్బతీస్తే విధానాలను వెంటనే రద్దు చేసి భారతదేశాన్ని కాపాడాలని లేనియెడల రైతు సంఘాలు వ్యవసాయ కార్మిక సంఘాలు మిగతా అన్ని సంఘాలను కలుపుకొని ఆందోళన ఉధృతం చేస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం వ్యవసాయ వాణిజ్య ఒప్పంద పత్రాలను ఎస్కేమ్ నాయకులు దగ్ధం చేయడం జరిగింది. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు ఎండి యాకూబ్ జమ్ముల శ్రీను, దర్గయ్య, తిమ్మిడి రవి, రామకృష్ణ, ముద్దేరబోయిన వెంకన్న, రాధా, షమీనా, భాగ్య, వరలక్ష్మి,వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుడి పెన్షన్‌తో మోడల్ స్కూల్ రోడ్డుకు మరమ్మతులు

### ఎన్నిసార్లు వార్తలు వచ్చినా స్పందించని అధికారులు, ప్రజాప్రతినిధులు సయ్యద్ ఆవేదన



**తొలి అక్షరం/చౌటుప్పల్, జూలై 21:** చౌటుప్పల్ పట్టణంలోని లక్కారం మోడల్ స్కూల్‌కు వెళ్లే ప్రధాన రహదారి చాలా కాలంగా గుంతలమయంగా మారి విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఆటో డ్రైవర్లు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుమార్లు వార్తాపత్రికల్లో కథనాలు ప్రచురితమైనప్పటికీ సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది.ఈ పరిస్థితిని చూసిన దివ్యాంగుడు సయ్యద్ తనకు ప్రభుత్వం అందించే దివ్యాంగుల పెన్షన్ డబ్బుతో స్వచ్ఛందంగా రోడ్డు మరమ్మతులు చేపట్టారు. గుంతలను మట్టితో నింపించి, రహదారిని లెవెలింగ్ చేయించి విద్యార్థులు, వాహనదారులు సురక్షితంగా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకున్నారు.ఈ సందర్భంగా సయ్యద్ మాట్లాడుతూ, “ప్రజల సమస్యలను పరిష్కరించడం ప్రజాప్రతినిధులు, అధికారుల బాధ్యత. ఎన్నిసార్లు వార్తలు వచ్చినా స్పందించకపోవడం చాలా బాధాకరం. రోజూ వందలాది మంది విద్యార్థులు ఈ రహదారిపై ప్రయాణిస్తున్నారు. కనీసం వారి భద్రతను దృష్టిలో పెట్టుకుని ఈ రహదారిని శాశ్వతంగా సీసీ లేదా బీటీ రోడ్డుగా నిర్మించాలి. నా వంతు సామాజిక బాధ్యతగా ఈ చిన్న సహాయం చేశాను“ అని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఆటో డ్రైవర్లు సయ్యద్ భాయ్ సేవాభావాన్ని అభినందించారు. వర్షాకాలంలో ఈ రహదారి మరింత దెబ్బతింటోందని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పేర్కొంటూ ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మోడల్ స్కూల్ రోడ్డును శాశ్వతంగా సీసీ లేదా బీటీ రోడ్డుగా నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడకముందే సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు.

# ఈనెల 26 వరకు డిగ్రీ ప్రవేశాల నమోదు చేసుకోవాలి

### • తొర్రూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రాములు



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) జూలై 2:** ఈనెల 26 వరకు దోస్త్ స్పెషల్ ఫేస్ ద్వారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాల నమోదు చేసుకోవాలని తొర్రూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రాములు, దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ సునీల్ లు కోరారు. మంగళవారం వారు మాట్లాడుతూ 202627 విద్యా సంవత్సరానికి డిగ్రీ ప్రవేశాల కోసం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ దోస్త్ స్పెషల్ ఫేజ్ నోటిఫికేషన్ విడుదల చేసిందని, స్పెషల్ ఫేజ్ రిజిస్ట్రేషన్లు 21 జూలై 2026 నుండి ప్రారంభమైందని,ఈ స్పెషల్ ఫేజ్ ద్వారా ఇప్పటివరకు డిగ్రీ కళాశాలలో ప్రవేశం పొందని విద్యార్థులతో పాటు, డిగ్రీలో ప్రవేశం పొందేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు 26 వరకు దోస్త్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు.అలాగే నీట్ మరియు ఇంజనీరింగ్ ప్రవేశాల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు తమ కౌన్సిలింగ్ ప్రక్రియ ఇంకా పూర్తికాకపోయినప్పటికీ, విధిగా దోస్త్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అర్హులైన విద్యార్థులు గడువు తేదీలోపు తమ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకొని, వెబ్ ఆప్షన్లు నమోదు చేసి సీటును పొందాలన్నారు.

# నెక్కొండ ఎస్ఐ మహేందర్ సస్పెన్షన్ నేపథ్యంలో మండల కేంద్రంలో సంబరాలు

### - నెక్కొండ మండల బి ఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సంఘని సూరయ్య



**తొలి అక్షరం/నెక్కొండ జూలై 21:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ మహేందర్‌ను సస్పెండ్ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేతా రెడ్డి ఉత్తర్వులు జారీ చేసిన సందర్భంగా నెక్కొండ మండల కేంద్రంలో మండల ప్రజలు స్వీట్లు పంచుకొని, బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించి సీపీ శ్వేతారెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసారు.ఎస్ఐ మహేందర్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలపై శాఖాపరంగా విచారణ చేపట్టగా, ప్రాథమికంగా ఆరోపణలకు ఆధారాలు ఉన్నట్లు అధికారులు గుర్తించిన నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, విధుల నిర్వహణలో నిష్పక్షపాత ధోరణి పాటించకుండా అధికార పార్టీ నాయకులకు అనుకూలంగా వ్యవహరించడం, అమాయకులపై రౌడీషీట్లు నమోదు చేసి మానసిక ఇబ్బందులకు గురిచేయడం వంటి ఆరోపణలు ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి దారితీశాయని పేర్కొన్నారు.

ఇకపై అయినా చట్టం ముందు అందరూ సమానులనే రాజ్యాంగ స్ఫూర్తిని పాటిస్తూ, ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా పోలీసులు నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని, నెక్కొండలో ప్రతి పౌరుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరారు.అలాగే, అవినీతి ఆరోపణలపై చర్యలు తీసుకొని ఎస్ఐ మహేందర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేతా రెడ్డి కి నెక్కొండ మండల ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఢిల్లీలో విద్యార్థులపై నిరంకుశ దాడిని ఖండిస్తూ యుఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆందోళన

## నీట్ పేపర్ లీకేజీకి బాధ్యులైన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేపట్టిన విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం పోలీసు బలగాలను ప్రయోగించి చేసిన నిరంకుశ దాడిని తీవ్రంగా ఖండిస్తూ యు ఎస్ ఎఫ్ ఐ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండ అశోక జంక్షన్ చౌరస్తాలో నిరసన తెలిపారు.ఈ సందర్భంగా యు ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకుల మనోజ్ రాజేష్ నాయక్ మాట్లాడుతూ...దేశంలో విద్య,ఉపాధి,సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న విద్యార్థుల గొంతును అణిచివేయడానికి కేంద్ర ప్రభుత్వం దమనకాండకు దిగిందని మండిపడ్డారు.ప్రజాస్వామ్య దేశంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన మౌలిక హక్కు అని,ఆ హక్కును లాఠీలతో అణచివేయడం రాజ్యాంగ స్ఫూర్తిపై దాడి చేసినట్టేనని అన్నారు.ప్రశ్నించే విద్యార్థులను అరెస్టులు చేయడం,నిర్బంధించడం ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలని పేర్కొన్నారు.ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన దాడికి బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని,అరెస్టు చేసిన విద్యార్థులను బేషరతుగా విడుదల చేయాలని,విద్యార్థి ఉద్యమాలపై దమనకాండను తక్షణమే నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అదే విధంగా దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న నీట్ (చీజుజు) పరీక్ష పేపర్ లీకేజీ దేశ విద్యా వ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసిందని అన్నారు.ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.పరీక్షల నిర్వహణలో పారదర్శకత,విశ్వసనీయతను కాపాడడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేపట్టి,కుట్రలో ఉన్న ప్రతి ఒక్కరిపై కఠిన చర్యలు తీసుకోవాలని,భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ఠమైన పరీక్షా వ్యవస్థను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.ఈ నిరసన కార్యక్రమంలో యు ఎస్ ఎఫ్ ఐ జిల్లా నాయకులు సూరజ్ మహేష్ రాజు నితీష్ ప్రణయ్ అఖిల్ రాకేష్,సింగ్ నిఖిల్ తదితరులు పాల్గొన్నారు

# షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం




**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 21:** షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 202627 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపకుల (గెస్ట్ ఫాకల్టీ ) నియామకాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎల్. కమల తెలిపారు. కళాశాలలో ఇంగ్లీష్2, తెలుగు1, హిస్టరీ1, జంతుశాస్త్రం1, సెరికల్చర్1, గణితశాస్త్రం1, కంప్యూటర్ సైన్స్1 విభాగాల్లో మొత్తం 8 ఖాళీలను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు.సంబంధిత సబ్జెక్టులో కనీసం 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 50 శాతం మార్కులు ఉంటే సరిపోతుందని తెలిపారు. అలాగే యూజీసీ నిబంధనల ప్రకారం నెట్, సెట్, స్లెట్ లేదా పీహెచ్‌డీ అర్హత కలిగిన వారికి, బోధన అనుభవం ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు.నియామక ప్రక్రియను యూజీసీ మార్గదర్శకాలు, ఉన్నత విద్యా కమిషన్ నిబంధనలకు అనుగుణంగా పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు అవసరమైన విద్యార్హతల ధ్రువపత్రాలతో కూడిన దరఖాస్తులను జులై 23వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం కళాశాల కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

# గుండె వైపల్య రోగులలో గుండె పనితీరు మెరుగుపరిచే ప్రత్యేక చికిత్స

- కన్సల్టెన్సీ కార్డియాలజీ ఎలక్ట్రో ఫిజియాలజిస్ట్ అండ్ హార్ట్ ఫెయిల్యూర్ స్పెషలిస్ట్ డాక్టర్ ఎం.ఎస్.చంద్రమౌళి



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** యశోద హాస్పిటల్ లో కార్డియాక్ ఎలక్ట్రో ఫిజియోలజీ విభాగం గుండె స్పందనలో వచ్చే అసాధారణ నిర్ధారణ చికిత్స ప్రతి మనిషిలో గుండె వైపల్య గుండె పనితీరు మెరుగుపరిచే ప్రత్యేక చికిత్స అని అన్నారు.హనుమకొండ లోని యశోద క్లినిక్ లో నిర్వహించిన మీడియా సమావేశం లో కన్సల్టెన్సీ కార్డియాలజీ ఎలక్ట్రో ఫిజియోలజిస్ట్ అండ్ హార్ట్ ఫెయిల్యూర్ స్పెషలిస్టు ఎమ్.ఎస్.చంద్రమౌళి మాట్లాడుతూ...అత్యాధునిక మ్యాపింగ్ సిస్టం సహాయంతో నిర్వహించే ప్రత్యేక ప్రక్రియను మెట్రిక్లర్ టాకీ కార్డియా అబ్లేషన్ ప్రాణాపాయ గుండె స్పందన వ్యాధులకు అధునాతన చికిత్స ఫేస్ మేకర్ ఎంప్లాటేషన్ సిస్టం ఛాంబర్,డ్యూయల్ ఛాంబర్ కండక్షన్ సిస్టం ఫేసింగ్ పద్దతులు లీడ్స్ ఫేస్ మేకర్ వైర్లు లేకుండా అమర్చే అత్యధిక ఆకస్మిక గుండె మరణాన్ని నివారించే ప్రాణ రక్షక పరికరం అని అన్నారు.గుండె స్పందనలో వచ్చే అసాధారణతలను చాలామంది సాధారణ సమస్యగా భావించి నిర్లక్ష్యం చేస్తానని అన్నారు.అయితే గుండె సమస్యకు ముందు తల తిరగడం స్పృహ కోల్పోవడం గుండె దడ లేదా శ్వాస ఇబ్బంది వంటి లక్షణాలు తీవ్రమైన రితం సమస్యలకు సంకేతాలు కావచ్చునని ఆధునిక ఎలక్ట్రో పిజియాలజీ చికిత్సల ద్వారా చాలామంది రోగులు పూర్తిస్థాయి ఆరోగ్యాన్ని తిరిగి పొందగలుగుతున్నారు.సరైన సమయంలో నిపుణులను సంప్రదించడం అత్యంత ముఖ్యమని అన్నారు.యశోద హాస్పిటల్ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సేవలు అందిస్తుందని అన్నారు.గుండె స్పందన సక్రమంగా ఉంటే జీవితం సురక్షితం ప్రతిస్పందన కాపాడటం మా బాధ్యత అని తెలిపారు.

# ఎంజియం ముందు ఆటోలు నిలపొద్దు



## ఎంజీఎం ఆస్పత్రిని సందర్శించిన వరంగల్ సీపీ ఎన్. శ్వేత

**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత యం.జి.యం హాస్ప టల్ ను సందర్శించారు.ముందుగా మహాత్మా గాంధీ మెమోరియల్ (ఎంజీఎం) హాస్పిటల్ ప్రధాన ద్వారంలో ఆటోలను నిలపకుండా తీసుకోవలసిన చర్యలపై వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత ట్రాఫిక్ అధికారులకు పలు సూచనలు చేశారు.పోలీస్ అవుట్ పోస్ట్ సందర్శించి సిబ్బంది నిర్వహిస్తున్న విధులు,ఇక్కడికి వచ్చే మెడికో లీగల్ కేసులకు సంబంధించి ఏవిధమైన చర్యలు చేపడుతున్నారనే వాటికి సంబందించి వివరాలను నమోదు చేసే రికార్డులను పరిశీలించారు.అనంతరం మత్తు పదార్థాలకు బానిసలుగా మారిన యువతకు చికిత్స అందిస్తున్న డి అడిక్షన్ కేంద్రాన్ని సందర్శించారు.ఈ కేంద్రంలో మత్తు పదార్థాలకు అలవాటు పడిన యువతను సాధరణ స్థితికి తీసుకవచ్చేందుకు వైద్యులు అందిస్తున్న చికిత్స విధానాన్ని వైద్యులు పోలీస్ కమిషనర్ కు వివరించారు.ఈ సందర్భంగా యం.జి. యం.పరిసరాలను పరిశీలించిన సి పి హాస్పటల్ కు సంబందించి ప్రధాన మార్గం తో పాటు,వాహన పార్కింగ్ ప్రదేశాలు,ముఖ్యమైన స్థలాల్లో సిసి కెమెరాల ఏర్పాటుపై సంబందించిన అధికారులకు పలు సూచనలు చేశారు.ముఖ్యంగా ఆస్పత్రి ప్రధాన ద్వారం వద్ద ఆటోలను నిలపకుండా చర్యలు తీసుకోవాలని,సందర్శకులకు ఎలాం టి ఇబ్బందులు కలగ కుండా ట్రాఫిక్ ను సమర్థంగా నిర్వహించాలని తెలిపారు.ప్రధాన ద్వారం గుండా వచ్చే వారికి ఏ విధమైన ఆటంకం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

పోలీస్ కమిషనర్ వెంట సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత,యం.జి.యం సూపరిం టెండెంట్ రాంకుమార్ రెడ్డి,ఆర్.యం. ఓ,ఏసీపీలు జితేందర్ రెడ్డి,సదయ్య,సత్యనా రాయణ, ప్రశాంత్ రెడ్డి ఇన్స్పెక్టర్లు కరుణాకర్,రాఘవేందర్ తో పాటు ఆర్.ఎస్.ఐలు పూర్ణ చందర్ రెడ్డి, మనోజ్,నాగరాజు లతో ఇతర అధికారులు వున్నారు.

# నెక్కొండ హైస్కూల్ నందు ఫౌండేషనన్ లిటరసీ అండ్ న్యూమరసి శిక్షణ కార్యక్రమం

- కోర్సు కోఆర్డినేటర్‌గా మండల విద్యాశాఖ అధికారి భూక్య రవికుమార్.



**తొలి అక్షరం/నెక్కొండ జూలై 21:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని రెండు రోజుల నుండి మండలంలోని నెక్కొండ హైస్కూల్ నందు ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరాసి శిక్షణలో కార్యక్రమంలో భాగంలో భాగంగా నెక్కొండ మండలంలోని సెకండరీ గ్రేడ్ టీచర్లకు మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి కోర్స్ కోఆర్డినేటర్ గా మండల విద్యాశాఖ అధికారి బి రవి కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి మండలంలోని 50 శాతం మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు హాజరు అవ్వడం జరుగుతుంది. విద్యార్థులలో నాణ్యమైన బోధన అందించుటకు ప్రభుత్వము నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారము ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు 50% పాల్గొనడం జరిగింది., ఆర్ పి లుగా రామ్మోహన్,ప్రతాప్, రమేష్ ,లక్ష్మీప్రియ లో నిర్వహిస్తున్నారు.



# చిన్నకోర్పోల్ గ్రామంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్ష ,ఉపాధ్యక్షుల ఎన్నిక.



-మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు, ఇండ్ల సతీష్ ముదిరాజ్.

- మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షులు మారబోయిన రాజు ముదిరాజ్.

**తొలి అక్షరం/నెక్కొండ జూలై 21:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని చిన్నకోర్పోల్ గ్రామం లో మత్స్య పారిశ్రామిక సహకార సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్ష ,డైరెక్టర్లకు ఎన్నిక జరగగా, ముదిరాజ్ సంఘ సభ్యులు అందరూ ఏకగ్రీవంగా ఇండ్ల సతీష్ ముదిరాజ్ ని అధ్యక్షునిగా మారబోయిన రాజు ముదిరాజ్ ని ఉపాధ్యక్షుడిగా పిట్టల రాజు ముదిరాజ్ ని కార్యదర్శిగా మరియు అన్నేబోయిన అశోక్, అన్నేబోయిన రాజశేఖర్, చిరబోయిన నాగార్జున్ ముదిరాజ్, చిరబోయిన సురేష్, ఇండ్ల శ్రీను ముదిరాజ్,అన్నేబోయిన ప్రశాంత్, లను డైరెక్టర్లుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షుడిగా ఎన్నుకున్న ఇండ్ల సతీష్ ముదిరాజ్ మాట్లాడుతూ ముదిరాజ్ కుల సంఘ సభ్యులు అందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే నాపై నమ్మకంతో ఈ యొక్క పదవి అప్ప చెప్పినందుకు మీ అందరికీ న్యాయం చేస్తానని భరోసా ఇస్తానని తెలియజేశారు.ఈ యొక్క ఎన్నిక నిర్వహించిన ఎన్నికల అధికారి బద్రుద్దీన్ ఎన్నిక పత్రాన్ని ఇండ్ల సతీష్ ముదిరాజ్ కి అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు చీరబోయిన యాకాబ్రశీ ముదిరాజ్, పిట్టల శ్రవణ్ కుమార్ సన్నాఫ్ పిట్టల సాంబయ్య ముదిరాజ్, ముదిరాజ్ కుల సభ్యులు చీరబోయిన సుధాకర్, చీరబోయిన ఆగయ్య, అన్నేబోయిన యాకయ్య, అన్నేబోయిన రాజు, ఇండ్ల ఏకాంతం,చిరబోయిన యాదగిరి,అన్నేబోయిన శ్రీను,అన్నేబోయిన సంపత్, సారయ్య,శంకర్ మారబోయిన అశోక్ కుల సభ్యులు అందరూ పాల్గొన్నారు.

# మండల ఎన్‌పిడిఆర్ ఇండియా వికలాంగుల సంఘం నెక్కొండ మండల అధ్యక్షుడిగా అనంతల వీరేష్ ఎన్నిక



**తొలి అక్షరం/నెక్కొండ జూలై 21:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని పెద్ద కోరుపోలు గ్రామానికి చెందిన అనంతల వీరేష్ ఎన్ పి డి ఆర్ ఇండియా వికలాంగుల సంఘం నెక్కొండ మండల శాఖ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం జరిగింది. గత కొన్ని సంవత్సరాలుగా వికలాంగుల హక్కుల కోసం. వికలాంగుల సమస్యలసాధన కోసం కృషి చేసినందుకు గాను తన సేవలను గుర్తించి ఎన్ పి ఆర్ డి ఇండియాజాతీయ అధ్యక్షులు తుడుం. రాజేందర్. రాష్ట్ర అధ్యక్షులు దైనంపల్లి మల్లికార్జున్. వరంగల్ జిల్లా ఇంచార్జి. నక్క. చిరంజీవి. నియామక పత్రం అందించడం జరిగింది. మండల కమిటీ లో గుజ్జెటి. ప్రభాకర్. ఏం. డి. యాకుబ్. కొత్వల. రమాదేవి. మునిగే. శాంత మండల కమిటీకి ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమంలో నెక్కొండ మండల వికలాంగులు అప్పం. రమేష్. పొన్నాల విజయ. శ్రీలత. శామ్ ప్రసాద్. రాజశేఖర్. తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నీట్ పేపర్ లీక్‌పై కేంద్రం జవాబుదారీతనం వహించాలి

**విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యాన్ని ఖండిస్తున్నాం**

**రాహుల్ గాంధీ ధర్నాకు సంపూర్ణ మద్దతు ప్రకటించిన మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి**

**తొలి అక్షరం/షాద్ నగర్,జులై 21:** దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసిన నీట్ (నీట్ ) పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం పూర్తి జవాబుదారీతనం వహించాలని మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి డిమాండ్ చేశారు. తమ హక్కుల కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన పోలీసుల దౌర్జన్యాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. న్యూఢిల్లీలో లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ,



కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా చేపట్టిన ధర్నాకు ఆయన సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా విశాల శ్రావణ్ రెడ్డి మాట్లాడుతూ, నీట్ పేపర్ లీక్ దేశ యువత భవిష్యత్తుపై తీవ్ర అనుమానాలు, ఆందోళనలకు కారణమైందన్నారు. పరీక్షల విశ్వసనీయత దెబ్బతినడం వల్ల విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. న్యాయం కోరుతూ శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. విద్యార్థుల గొంతును అణచివేయడం కాకుండా, వారి సమస్యలను వినడం, వారికి న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. దేశ యువతకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ విద్యార్థుల పక్షాన నిలబడుతుందని పేర్కొన్న ఆయన, విద్యార్థుల హక్కులు, పరీక్షల పారదర్శకత, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ చేపట్టిన పోరాటానికి కాంగ్రెస్ శ్రేణులు, ప్రజాస్వామ్యవాదులు, విద్యార్థులు, దేశ ప్రజలందరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

# భక్య తండాలో అట్టహాసంగా సీత్లా భవాని వేడుకలు

- **లౌడియా వాగ్య నాయక్ తండా సర్పంచ్**

**భూక్య భాజూ-మిట్టు నాయక్**



**తొలి అక్షరం/నెక్కొండ జూలై 21:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని లావుద్య వాగ్యా నాయక్ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని భక్య తండాలో బంజారాల ఆరాధ్య దైవం సీత్లా భవాని (గొడ్ల దాటుడు) పండుగ వేడుకలు అత్యంత అట్టహాసంగా జరిగాయి. ఈ పవిత్రమైన కార్యక్రమానికి సర్పంచ్ భూక్య భాజు మిట్టు ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తండా ప్రజలందరికీ పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ.. ఈ వర్షాకాలంలో తండావాసులు అందరూ చల్లగా ఉండాలని, పశువులు, జీవాలు ఆరోగ్యంగా ఉండి వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆ సీత్లా భవాని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో మాజీ ఉపసర్పంచ్ లావుడియా రవి, వార్డు మెంబర్ , భూక్య చిట్టీరవి, లావుడ్యా మమతరాకేష్, మరియు భూక్య. అలియా. పులియా, చిట్టీ, లాలు, విజన్, సామియా లతో పాటు తండా పెద్దలు మరియు తండా వాసులందరూ అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు.

# ఉద్యమకారులను వేధించింది కేసీఆర్ ప్రభుత్వమే

**షాద్‌నగర్ తెలంగాణ ఉద్యమకారుడు టీజీ శ్రీనివాస్**

**అమరవీరుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం ఎంతమందికి ఇచ్చారో చెప్పాలి**

**ఉద్యమకారులపై కేసులు పెట్టి, ఉద్యోగులను వేధించారు**

**కేసీఆర్‌కు ఉద్యమకారుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు**

**కోదండరాం నుంచి రాంబల్ నాయక్ వరకు ఉద్యమకారులను ఇబ్బందులకు గురిచేశారు**

**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 21:** తెలంగాణ ఉద్యమకారులను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీవ్రంగా వేధించిందని తెలంగాణ ఉద్యమకారుడు టీజీ శ్రీనివాస్ ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ అసెంబ్లీలో 1,200 మంది తెలంగాణ కోసం అమరులయ్యారని ప్రకటించారని, అయితే వారిలో ఎంతమంది కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించారో వెల్లడించాలని డిమాండ్



చేశారు. 500 మందికి కూడా రూ.10 లక్షలు అందలేదని ఆయన ఆరోపించారు. అమరవీరుల కుటుంబాల వివరాలు తమ ప్రభుత్వానికి తెలియవని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా ప్రకటించారని టీజీ శ్రీనివాస్ పేర్కొన్నారు. తొమ్మిదిన్నరేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఉద్యమకారులను పట్టించుకోకుండా ఇబ్బందులకు గురిచేశారని విమర్శించారు. తెలంగాణ జనసేనాని ప్రొఫెసర్ కోదండరాం నుంచి రాంబల్ నాయక్ వరకు పలువురు ఉద్యమకారులను గత ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేసిందని ఆరోపించారు. కోదండరాం పక్కన కూర్చున్న ఉద్యోగులకు ఛార్జ్ మెమోలు ఇచ్చారని, కొంతమంది ఉద్యోగులను పదవుల నుంచి తొలగించారని అన్నారు. మరికొందరు ఉద్యమకారులపై కోర్టు కేసులు పెట్టి, ఎస్సీ, ఎస్టీ వేధింపుల కేసులతో ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. షాద్ నగర్ లో తెలంగాణ ఉద్యమకారుడు గిరిజన బిడ్డ రాంబల్ నాయక్ పై కూడా రౌడీషీట్ కేసు పెట్టి వేధించారని గుర్తు చేశారు. షాద్ నగర్ లో ఉద్యమకారులకు ఏం ఒరిగిందని ప్రశ్నించారు. ఎంతోమంది ఉద్యమం దెబ్బకు ఇంకా కోలుకోలేని పరిస్థితుల్లో యువత నిరుద్యోగులు ఉన్నారని టీజీ శ్రీనివాస్ అన్నారు. ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాల గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్‌ఎస్ నాయకులకు లేదని టీజీ శ్రీనివాస్ అన్నారు. అందుకే ఉద్యమకారులు, ఉద్యోగులు బీఆర్‌ఎస్‌కు దూరమయ్యారని పేర్కొన్నారు. అధికారం కోల్పోయి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఉద్యమకారులను గుర్తించడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం ఏర్పాటు చేయడానికి కూడా తమ వద్ద డబ్బులు లేవని గత ప్రభుత్వం ప్రకటించిందని ఆయన గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమకారులపై ఎవరికీ పేటెంట్ లేదని స్పష్టం చేశారు. ఉద్యమకారుల ఫోన్లను ట్యాపింగ్ చేశారని ఆరోపించిన టీజీ శ్రీనివాస్, గత ప్రభుత్వం చేసిన తప్పులకు ముందుగా ఉద్యమ కారులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# నీట్-యూజీ అక్రమాలపై ఎస్ఎఫ్ఐ ఆందోళన

- **కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్**
- **విద్యార్థులపై లాఠీచార్జ్‌ను ఖండించిన జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్**




**తొలి అక్షరం/షాద్‌నగర్, జూలై 21:** నీట్-యూజీ పరీక్షల్లో చోటుచేసుకున్న అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం షాద్‌నగర్ పట్టణ చౌరస్తాలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ, దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నీట్-యూజీ పరీక్షల అక్రమాలపై శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం, బాష్పవాయువు ప్రయోగించడం తీవ్రంగా ఖండనీయమన్నారు. విద్యార్థుల తలలు పగలగొట్టేలా వ్యవహరించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు. నీట్-యూజీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. పరీక్షల నిర్వహణలో జరిగిన లోపాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై అక్రమ కేసులు నమోదు చేసినా, లాఠీచార్జ్ చేసినా విద్యార్థి ఉద్యమాలను అణచివేయలేరని స్పష్టం చేశారు. భగత్‌సింగ్ వారసులుగా విద్యార్థుల హక్కుల కోసం చివరి వరకు పోరాడుతామని హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే చర్యలను కేంద్ర ప్రభుత్వం వెంటనే నిలిపివేసి, నీట్-యూజీ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ అరెస్ట్ అప్రజాస్వామికం

**ఆకుల ఇంద్రసేనారెడ్డి చౌటుప్పల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్**

**తొలి అక్షరం/చౌటుప్పల్ జులై 21:** జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై జరిగిన లాఠీచార్జీని నిరసిస్తూ ప్రధానమంత్రి నివాసం ముందు శాంతియుతంగా ఆందోళన చేపట్టిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంకా గాంధీతో పాటు ఇతర కాంగ్రెస్ నేతలను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనారెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య దేశంలో శాంతియుత నిరసన వ్యక్తం చేయడం ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధ హక్కు అని, ఆ హక్కును హరించే విధంగా వ్యవహరించడం ప్రజాస్వామ్య విలువలకు విఘాతం కలిగిస్తుందని అన్నారు. జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై జరిగిన లాఠీచార్జీ ఘటనపై స్వతంత్ర, నిష్పాక్షిక విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన అవకతవకలు, పేపర్ లీకేజీ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని కోరారు. నీట్ పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజీ కారణంగా తీవ్ర మనోవేదనకు గురైన విద్యార్థులు, వారి కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలవాలని, ఈ అంశంపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చ నిర్వహించి వాస్తవాలను దేశ ప్రజలకు వెల్లడించాలని ఆకుల ఇంద్రసేనారెడ్డి కోరారు. దేశ యువత భవిష్యత్తుతో చెలగాటం ఆడే చర్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని, నిర్బంధ రాజకీయాలను విడిచిపెట్టి కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



# రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ సర్వే కార్యక్రమం.

**-పిట్టకల్ బోర్డు తండా గ్రామపంచాయతీ గ్రామ సర్పంచ్ బాదవత్ సూర్య నాయక్ ,**



**తొలి అక్షరం/నెక్కొండ జూలై 21:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి ప్రతి గ్రామంలోని సాధారణ మరియు పట్టా దారు భూముల సర్వే కార్యక్రమాన్ని గ్రామ గ్రామంలో నిర్వహించేటువంటి క్రమంలో నెక్కొండ మండల కేంద్రంలోని పిట్ట కాల్ బోర్డు తండా, వెంకటాపురం, అప్పలరావు పేట్, పలు గ్రామాలలో ప్రభుత్వ ఆధ్వర్యంలో సర్వేయర్లు భూమి సరిహద్దులను మరియు భూమి కొలతను కొనసాగించడం జరుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి ఒక్క గ్రామంలో ఉండే భూ సర్వే నిర్వహించి,వారి యొక్క భూమి యొక్క సరిహద్దులను పట్టాదారు పాస్ పుస్తకాలను తప్పనిసరిగా అందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన నిర్ణయం తీసుకోవడం జరిగింది . ఈ కార్యక్రమంలో భాగంగా వెంకటాపురం, పిట్టకాల్ బోర్డు తండా భూ సర్వేలో భాగంగా పాల్గొన్న సర్పంచ్ బాదావత్ సూర్యా భాయ్ మరియు నెక్కొండ మండల తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


# కార్యకర్తల కుటుంబ సభ్యులను పరామర్శించిన వేముల

**తొలి అక్షరం/రామన్నపేట జూలై 21:**

రామన్నపేట మండలం సిరిపురం గ్రామానికి చెందిన ఏలే కుమారస్వామి ఇటీవల మరణించగా . వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. రామన్నపేట మండల కేంద్రానికి చెందిన గోదాసు పుష్పమ్మ బొడ్డు రాములు ఇటీవల మరణించగా . వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.



# ఎస్ఐఆర్‌పై వేముల, బీర్ల చామల సమీక్ష సమావేశం



**తొలి అక్షరం/రామన్నపేట జూలై 21:**రామన్నపేటలో ఎస్ ఐ ఆర్ కార్యక్రమంపై బిఎల్ఎ లతో సమీక్ష సమావేశం ప్రభుత్వ విప్‌లు వేముల వీరేశం, బీర్ల ఐలయ్య పాల్గొన్నారుఈ సమావేశంలో ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య నకిరేకల్ నియోజకవర్గ ఎస్ ఐ ఆర్ కోఆర్డినేటర్ ముప్వా విజయ్ బాబు , ఈ ఆర్ ఓ లెవల్ కోఆర్డినేటర్ చామల శ్రీనివాస్ పాల్గొన్నారు ప్రజాప్రతినిధులు, బిఎల్ఎ లు, కాంగ్రెస్ పార్టీ నాయకలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం గారు మాట్లాడుతూఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి కార్యకర్త ఎంతో కష్టపడి పనిచేశారని అభినందించారు. చివరి దశకు చేరుకున్న ఈ ప్రక్రియను అదే నిబద్ధతతో పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి , ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ , పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ప్రతి ఓటు అత్యంత కీలకమని స్పష్టం చేశారని పేర్కొన్నారు.అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా బిఎల్ఎలు అప్రమత్తంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని అన్నారు. రాష్ట్రంలో ఎస్ ఐ ఆర్ కార్యక్రమం అమలులో యాద్రి భువనగిరి జిల్లా మొదటి స్థానంలో నిలవడం అభినందనీయమని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి కుటుంబానికి సన్నబియ్యం, రేషన్ కార్డులు వంటి సంక్షేమ పథకాలను అందిస్తోందని తెలిపారు.పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.గత పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని భారీ అప్పుల్లోకి నెట్టారని విమర్శించారు. రైతులకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ పార్టీయేనని పేర్కొన్నారు. అలాగే ఓట్ల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.

## అంగన్వాడీ టీచర్స్ ఆయా నోటిఫికేషన్ విడుదల

● వెంకట రమణ సిపిడిఓ రామన్నపేట

**తొలి అక్షరం/రామన్నపేట జూలై 21:** రామన్నపేట ప్రాజెక్టు పరిధిలోని నాలుగు మండలాలకు సంబంధించిన మొత్తం 12 టీచర్స్ నాలుగు ఆయా పోస్టుల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేస్తున్నట్లు రామన్నపేట సి పి డి ఓ వెంకటరమణ పత్రిక ప్రకటనలో తెలిపినారు. అర్హులైన మహిళా అభ్యర్థులు అప్లై చేసుకోవాలని తెలిపినారు.

## ఘనంగా మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలు



**తొలి అక్షరం/రామన్నపేట జూలై 21:** రామన్నపేట సుభాష్ సెంటర్ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే జన్మదిన సందర్భంగా సుభాష్ సెంటర్ వద్ద కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపినారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షులు పున్న జగన్మోహన్, బట్టల కాంగ్రెస్ అధ్యక్షులు జమీరుద్దీన్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి కొత్తపల్లి అబ్రహం కుమార్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు కందిమల్ల గోపాల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు జెల్లా వెంకటేష్, వనం గుత్తా నర్సిరెడ్డి చంద్రశేఖర్, సాల్వేర్ అశోక్ , శంబాల వెంకన్న మొహమ్మద్ నాసర్ రాయిని రమేష్ , కోట సుధాకర్ లక్ష్మణ్ మహమ్మద్ రిజ్వాన్ బండ అంజిరెడ్డి ఏటేల్లి పరమేశ్, లెంకల ప్రవీణ్, మొహమ్మద్ అజార్ శోభ కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వేములకు మంత్రి హోదా కల్పించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు

● పున్న .జగన్మోహన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రామన్నపేట



నకిరేకల్ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ వేముల వీరేశం కి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మంత్రి హోదా కల్పించినందుకు రామన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పున్న జగన్మోహన్ పత్రికా ప్రకటనలో తెలిపినారు. నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తూ నిత్యం ప్రజల్లో ఉంటూ రైతుల సమస్యలు తెలిసినటువంటి వేముల వీరేశం కి మంత్రి హోదా ఇవ్వడం చాలా గొప్ప విషయమని తెలిపినారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



**తొలి అక్షరం/రామన్నపేట జూలై 21:**
నకిరేకల్ పట్టణ కమ్యూనిస్టు యోధురాలు పన్నాల శశికళ మృతి చెందడంతో వారి పార్థిహ దేహం పై పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చిన.దైద రవీందర్ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఈ కార్యక్రమంలో గార్లపాటి రవీందర్ రెడ్డి బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# "చలో కలెక్టరేట్" కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

● జిల్లా అధ్యక్షుడు గంటెపాక శివకుమార్ పిలుపు



**తొలి అక్షరం/రామన్నపేట జూలై 21:**గ్రామీణ వృత్తి కళాకారుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో కళాకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ఆగస్టు 17న జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు జరిగే మహాధర్నాలు జయప్రదం చేయాలని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు గంటపాక శివకుమార్ పిలుపునిచ్చారు. స్థానిక రామన్నపేట మండల కార్యాలయంలో జరిగిన ప్రజానాట్యమండలి మండల కమిటీ సమావేశంలో హాజరై మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వృత్తి కళాకారులు అనేక ఆర్థిక, సామాజిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల సమయంలో కళాకారుల సంక్షేమం కోసం ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాకపోవడం బాధాకరమని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో కళాకారుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ఆగస్టు 17న నిర్వహించనున్న "చలో కలెక్టరేట్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న వృత్తి కళాకారులు, ప్రజా కళాకారులు, సాంస్కృతిక రంగానికి చెందిన ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.కళాకారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే స్పందించి, ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల నూతన అధ్యక్షుడిగా బర్రె మధు ను ఎన్నుకోగా ఈ సమావేశంలో ప్రజానాట్యమండలి మండల కార్యదర్శి గంటెపాక శ్రీకృష్ణ,నకిరేకంటి సురేష్, మజ్జురి సాయి, మేడి పృథ్వి, మేడి వెంకన్న, కనుకుంట్ల ఉపేందర్, కొండగడప చరణ్, బూడిద ఆదిత్య, తుర్కపల్లి లోకేష్, జిట్ట రాజేష్ కమిటీ సభ్యులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# లైసెన్స్ లేకపోతే కఠిన చర్యలు

- మల్కాజిగిరి ట్రాఫిక్ కమిషనరేట్ వ్యాప్తంగా విస్తృత తనిఖీలు
- ఒక్కరోజే 1,624 కేసులు.. రూ.2,88,600 జరిమానా
- మైనర్ డ్రైవింగ్‌పై 12 కేసులు.. నేరుగా కోర్టుకు చార్జ్‌షీట్

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),జూలై21:** రహదారి భద్రతను మెరుగుపరచడం,మోటారు వాహనాల చట్టాన్ని కఠినంగా అమలు చేయడమే లక్ష్యంగా మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీ లెక్కింపు (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్) చేపట్టారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడం, వెంట తెచ్చుకోకపోవడం, సరైన పత్రాలు లేకపోవడం,మైనర్ డ్రైవింగ్‌పై జూలై 21న కమిషనరేట్ పరిధిలోని జోన్-1, జోన్-2 వ్యాప్తంగా అన్ని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ ఉత్తర్వుల మేరకు, ట్రాఫిక్ డిసిపి-1 శ్రీ కె. రాహుల్ రెడ్డి, ఐపీఎస్, ట్రాఫిక్ డిసిపి-2 శ్రీ వి. శ్రీనివాసులు పర్యవేక్షణలో ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు మరియు ట్రాఫిక్ సిబ్బంది ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో ఈ తనిఖీలు చేపట్టారు.

Malkajgiri Commissionerate

Special Drive Cases on W/o Driving License, W/o Documents & Minor driving Dt: 21.07.2026

| S.No | Police station | W/o Driving License | | W/o Carrying Driving License | | W/o Documents | | Minor driving (Charge sheet) | Grand Total | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | Cases | Amount | Cases | Amount | Cases | Amount | | Total Cases | Total Amount |
| 1 | Malkajgiri Tr PS | 7 | 3500 | 28 | 2800 | 77 | 7700 | | 112 | 14000 |
| 2 | Gopalpuram Tr PS | 38 | 19000 | 54 | 5400 | 80 | 8000 | | 172 | 32400 |
| 3 | Jawaharnagar Tr PS | 3 | 1500 | 31 | 3100 | 71 | 7100 | | 105 | 11700 |
| 4 | Trimulgherry Tr PS | 62 | 31000 | 83 | 8300 | 87 | 8200 | 5 | 237 | 47500 |
| 5 | Alwal Tr PS | 27 | 13500 | 40 | 4000 | 91 | 9100 | | 158 | 26600 |
| 6 | Begumpet Tr PS | 40 | 20000 | 39 | 3900 | 20 | 1700 | 3 | 102 | 25600 |
| Zone- I | | 177 | 88500 | 275 | 27500 | 426 | 41800 | 8 | 886 | 157800 |
| 1 | LB Nagar Tr PS | 28 | 14000 | 67 | 6700 | 99 | 9900 | | 194 | 30600 |
| 2 | Vanasthalipuram Tr PS | 36 | 17000 | 48 | 4800 | 59 | 5800 | 1 | 144 | 27600 |
| 3 | Uppal Tr PS | 54 | 27000 | 83 | 8300 | 43 | 4300 | | 180 | 39600 |
| 4 | Kushaiguda Tr PS | 13 | 6500 | 31 | 3100 | 29 | 2600 | 3 | 76 | 12200 |
| 5 | Ghatkesar Tr PS | 16 | 8000 | 29 | 2900 | 99 | 9900 | | 144 | 20800 |
| Zone- II | | 147 | 72500 | 258 | 25800 | 329 | 32500 | 4 | 738 | 130800 |
| Total | | 324 | 161000 | 533 | 53300 | 755 | 74300 | 12 | 1624 | 288600 |

Section:
W/o Driving License (S 181/177)
W/o Carrying Driving License (S 181/177)
W/o Documents (S 130/177)
Minor driving the vehicle under the age of 18 years (S 180, 181 of M.V.Act)

### రూ. 2.88 లక్షలకు పైగా జరిమానా:

ఈ తనిఖీల సమయంలో చెల్లుబాటు అయ్యే లైసెన్స్ లేకుండా, పత్రాలు లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై 1,624 కేసులు నమోదు చేసి, మొత్తం రూ. 2,88,600 జరిమానా విధించారు. అలాగే అత్యంత ప్రమాదకరమైన మైనర్ డ్రైవింగ్‌కు సంబంధించి 12 కేసులు గుర్తించారు. ఈ మైనర్ డ్రైవింగ్ కేసులన్నింటిపై చార్జ్‌షీట్ దాఖలు చేసి, చట్టప్రకారం కోర్టుకు పంపనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు.

### తల్లిదండ్రులకు తీవ్ర హెచ్చరిక:

ఏ పరిస్థితిలోనూ మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదు. మైనర్లకు వాహనాలు ఇచ్చే యజమానులు లేదా తల్లిదండ్రులపై చట్టపరమైన తీవ్ర చర్యలు ఉంటాయి. పిల్లలకు తగిన పరిపక్వత, అనుభవం లేకపోవడం వల్ల ఘోర ప్రమాదాలు జరుగుతున్నాయి.

రహదారి భద్రత అనేది బాధ్యతాయుతమైన డ్రైవింగ్‌తోనే మొదలవుతుంది. ఈ ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయి.-డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్), మల్కాజిగిరి

# వర్షంలోనూ సజావుగా ట్రాఫిక్

- బేగంపేటలో పీక్ అవర్ రద్దీని తనిఖీ చేసిన డీసీపీ రాహుల్ రెడ్డి ఐపీఎస్
- సిబ్బందికి మైక్-4 ద్వారా డీసీపీ కీలక ఆదేశాలు



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),జూలై21:** నగరంలో పడుతున్న వర్షాల దృష్ట్యా వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మల్కాజ్‌గిరి ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.పీక్ అవర్స్‌లో రద్దీని నియంత్రించడంతో పాటు రహదారులపై వర్షపు నీరు నిలవకుండా ఉండేందుకు బేగంపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు కీలక ప్రాంతాల్లో ట్రాఫిక్ డీసీపీ కె. రాహుల్ రెడ్డి, ఐపీఎస్ నేరుగా క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. ఈ తనిఖీల్లో తిరుమల గిరి డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ జి.శంకర్ రాజుతో పాటు స్థానిక ట్రాఫిక్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### క్షేత్రస్థాయి పరిశీలన కీలక ఆదేశాలు:

రహదారిపై అత్యంత ప్రాధాన్యత కలిగిన చిక్కోటి గార్డెన్స్, బేగంపేట పరిసర ప్రాంతాలలో డీసీపీ స్వయంగా పర్యటించారు.ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. వాటర్ లాగింగ్ పాయింట్ల తనిఖీ: లోతట్టు ప్రాంతాలు మరియు డ్రైనేజీ పాయింట్లను పరిశీలించి, రహదారులపై వర్షపు నీరు నిలవకుండా జీహెచ్ఎంసీ, నీటిపారుదల శాఖ సిబ్బందితో నిరంతరం సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు.

### వైర్‌లెస్ సందేశాలు (మైక్ 4):

సీనియర్ కమాండ్ వైర్‌లెస్ (మైక్ 4) ద్వారా క్షేత్రస్థాయి సిబ్బందికి ఎప్పటికప్పుడు తగిన సూచనలు అందించారు.

ట్రాఫిక్ నిలిచిపోకుండా క్విక్ రెస్పాన్స్ టీమ్‌లను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని స్పష్టం చేశారు.

### వాహనాల క్రమబద్ధీకరణ:

అత్యవసర సేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రాధాన్యతనిస్తూ, వర్షం కారణంగా ట్రాఫిక్ స్తంభించకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ డీసీపీ మాట్లాడుతూ..వర్ష సమయాల్లో వాహనదారులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరడం, నీరు నిలిచే ప్రాంతాలను వెంటనే గుర్తించి పురపాలక సిబ్బంది సహాయంతో క్లియర్ చేయడమే మా ప్రథమ ప్రాధాన్య త అని పేర్కొన్నారు.

అలాగే వర్షాల దృష్ట్యా వాహనదా రులు వేగాన్ని అదుపులో ఉంచుకొని, తగిన దూరం పాటిస్తూ జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని మరియు ఆన్-డ్యూటీ ట్రాఫిక్ పోలీసుల సూచనలకు సహకరిం చాలని మల్కాజ్‌గిరి ట్రాఫిక్ డీసీపీ ప్రజలను విజ్ఞప్తి చేశారు.

# హాకీ వరల్డ్‌కప్‌నకు భారత జట్టు ప్రకటన




2026 హాకీ ప్రపంచకప్ టోర్నమెంట్‌కు హాకీ ఇండియా భారత జట్టును మంగళవారం ప్రకటించింది. 20 మంది సభ్యులతో కూడిన జట్టుకు హర్మన్‌ప్రీత్ సింగ్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్ వచ్చే నెల 15న ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్‌లకు నెదర్లాండ్స్, బెల్జియం సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఈ టోర్నీలో భారత్ పూల్ డీలో ఉంది. ఈ గ్రూప్‌లో భారత్‌తోపాటు ఇంగ్లాండ్, పాకిస్థాన్, వేల్స్ జట్లు ఉన్నాయి. పురుషుల టోర్నీలో 16 జట్లు పోటీలో ఉన్నాయి. నాలుగేసి జట్లను నాలుగు గ్రూపులుగా విభజించారు. ప్రపంచ కప్ జట్టు ఎంపికపై టీమ్ హెడ్ కోచ్ ఫుల్టన్ మాట్లాడారు. 'ఇది చాలా సమతుల్యమైన జట్టు. ఇందులో అనుభవం ఉన్న ఆటగాళ్లు ఉన్నారు. అలాగే అద్భుతమైన ఫామ్‌లో ఉన్న యువ ఆటగాళ్లూ ఉన్నారు. ఈ ఇద్దరితో టీమ్ బ్యాలెన్స్‌గా ఉంది. భారత్ ప్రపంచ కప్ గెలిచి 50 ఏళ్లు పూర్తయింది. అందుకే ఇది మాకు ఒక ప్రత్యేకమైన ఎడిషన్ కానుంది. ఆ చరిత్ర ఈ వరల్డ్‌కప్‌నకు మాకు ప్రేరణ ఇస్తుంది. ఒత్తిడిలో చురుకైన నిర్ణయాలు తీసుకోవడం, మంచి ఔట్‌పుట్ ఇవ్వడంపైనే మేం దృష్టి పెట్టాము. మా ప్లేయర్లకు ఆట పట్ల నిబద్ధత ఉంది. వారు తమమత అత్యుత్తమ ప్రదర్శననిస్తూ, జట్టులో ఒకరినొకరు ప్రోత్సహించుకుంటున్నారు. పోటీ ఎంత కఠినంగా ఉంటుందో మాకు తెలుసు. కానీ మా ఆటపై మాకు నమ్మకం ఉంది. మా స్ట్రాటజీ సింపుల్. ఆటపైనే పూర్తి దృష్టి పెట్టడం, పూర్తి స్థాయిలో నిమగ్నమవుతూ టైటిల్ సాధించడమే మా టార్గెట్' అని కోచ్ అన్నారు.

పురుషుల హాకీ వరల్డ్‌కప్ 1971లో ప్రారంభం కాగా ఆ ఎడిషన్ (తొలి)లో భారత్ మూడో స్థానంతో సరిపెట్టుకుంది. రెండో ఎడిషన్‌లో రన్నరప్‌గా నిలిచింది. అయితే మూడో ఎడిషన్ (1975లో) ఫైనల్‌లో పాకిస్థాన్‌ను ఓడించిన టీమ్‌ఇండియా టైటిల్ ముద్దాడింది. అర్జిత్ పాల్ సింగ్ కెప్టెన్సీలో టీమ్‌ఇండియా 2–1 తేడాతో పాక్‌ను ఓడించింది. ఇక ఆ తర్వాత భారత్ మళ్లీ ఈ టోర్నీలో టైటిల్ అందుకోలేదు. గత ఎడిషన్ (2023) భారత్ తొమ్మిదో స్థానానికి పరిమితమైంది. ఈసారి బలమైన జట్టుతో భారత్ బరిలోకి దిగుతోంది. 50ఏళ్ల నాటి మ్యాజిక్‌ను రిపీట్ చేసి రెండోసారి ఈ టైటిల్‌ను సాధించడమే లక్ష్యంగా హర్మన్‌ప్రీత్ సేన వరల్డ్‌కప్‌లో ఆడనుంది.జట్టు ప్రకటన సందర్భంగా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ఈసారి పక్కా 'కప్పును ఇంటికి తీసుకొస్తాం' అని ధీమాగా చెప్పాడు. 'వరల్డ్‌కప్‌ను మరోసారి పక్కా మన ఇంటికి (భారత్‌కు) తీసుకొస్తాం. దేశాన్ని గర్వపడేలా చేసేందుకు మాకు ఇదొక మంచి అవకశం' అని హర్మన్‌ప్రీత్ అన్నాడు.

# జింబాబ్వే గడ్డపై అడుగుపెట్టిన భారత్..



ఇంగ్లాండ్ పర్యటన ముగిసింది. ఆదివారం (జులై 19, 2025) లార్డ్స్ వేదికగా జరిగిన చివరి వన్డేలో భారత్ ఓడిపోయి.. సిరీస్ కోల్పోయింది. అయితే ఇది జరిగిన రెండు రోజుల వ్యవధిలోనే టీమిండియా మరో పర్యటనకు సిద్ధమైంది. జులై 23 నుంచి జింబాబ్వేతో 3 టీ20ల సిరీస్ జరగనుంది. ఇందుకోసం ఇప్పటికే జట్టును సెలక్టర్లు ఎంపిక చేశారు. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో టీమిండియా బరిలోకి దిగింది. ఇక ఈ సిరీస్ కోసం ఒక్క చోట చేరిన భారత ఆటగాళ్లు.. మంగళవారం (జులై 21) జింబాబ్వేలో అడుగుపెట్టారు. ఈ మేరకు భారత ఆటగాళ్లు జింబాబ్వే ప్రయాణానికి సంబంధించిన వీడియోను బీసీసీఐ.. సోషల్ మీడియాలో షేర్ చేసింది. ముంబై టు హరారే అని క్యాప్షన్ ఇచ్చింది. ఇందులో తిలక్ వర్మ, ప్రభ్ సిమ్రాన్ సింగ్, మయాంక్ యాదవ్, వైభవ్ సూర్యవంశీ, రింకూ సింగ్ తదితరులు కనిపించారు. టీమిండియా సీనియర్ జట్టుకు షెడ్యూల్ బిజీగా ఉండటంతో.. వీవీఎస్ లక్ష్మణ్ .. ఈ సిరీస్‌కు తాత్కాలిక హెడ్ కోచ్‌గా ఎంపికయ్యాడు. జట్టుతో పాటు అతడు కూడా జింబాబ్వేకు వెళ్లాడు. భారత క్రికెట్ జట్టు ఇటీవల ముగిసిన ఇంగ్లాండ్ పర్యటనలో ఆశించిన స్థాయి ఫలితాలను సాధించలేకపోయింది. టీ20, వన్డే సిరీస్‌లలో ఓటమి పాలైన నేపథ్యంలో.. జింబాబ్వే పర్యటన కీలకంగా మారింది. యూకే పర్యటనలో ఎదురైన చేదు అనుభవాలను, చేజారిన సిరీస్‌ల పరాజయాలను పక్కన పెట్టి, జింబాబ్వేపై ఘన విజయం సాధించి మళ్లీ గెలుపు బాట పట్టాలని టీమిండియా పట్టుదలతో ఉంది. సీనియర్ ఆటగాళ్లకు విశ్రాంతినిచ్చిన నేపథ్యంలో, ఐపీఎల్‌తో పాటు దేశవాళీ క్రికెట్‌లో అదరగొట్టిన యువ ఆటగాళ్లు.. ఈ సిరీస్‌లో తుది జట్టులోకి రానున్నారు. గౌతమ్ గంభీర్ టీమిండియా హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి భారత జట్టు ప్రదర్శన మిశ్రమంగా ఉంది. టీ20 వరల్డ్ కప్ గెలిచినప్పటికీ.. దశాబ్దాల తర్వాత శ్రీలంక చేతిలో ఓడటం, సొంత గడ్డ మీద న్యూజిలాండ్ చేతిలో వైట్ వాష్‌కు గురి కావడం, ఐర్లాండ్, ఇంగ్లాండ్ గడ్డ మీద సిరీస్‌లు ఓడటం లాంటివి చోటు చేసుకున్నాయి. దీంతో గంభీర్ తీరు పట్ల విమర్శలు వస్తున్నాయి. ఐస్‌లాండ్ క్రికెట్ గంభీర్ పరువు తీసేలా ట్వీట్ వేసింది. ఇప్పుడు భారత జట్టు లక్ష్మణ్ మార్గదర్శకత్వంలో జింబాబ్వే టూర్‌కు వెళ్లింది. దీని వల్ల ఇప్పటికిప్పుడు గంభీర్‌కు వచ్చిన ఇబ్బందేం లేదు. సరిపడా విశ్రాంతి తీసుకొని, ఒత్తిడి తగ్గించుకోవడానికి ఇది గంభీర్‌కు ఉపకరిస్తుంది. కానీ భవిష్యత్తు టోర్నీల్లో భారత్ మెరుగైన ప్రదర్శన చేస్తేనే గంభీర్‌పై బీసీసీఐ నమ్మకాన్ని కొనసాగిస్తుంది. లేకపోతే 2027 వరల్డ్ కప్ తర్వాత అతడిపై వేటు పడే అవకాశం ఉంది.భారత్, జింబాబ్వే సిరీస్ షెడ్యూల్..తొలి టీ20: జులై 23 – హరారే స్పోర్ట్స్ క్లబ్‌రెండో టీ20: జులై 25 – హరారే స్పోర్ట్స్ క్లబ్‌మూడో టీ20: జులై 26 – హరారే స్పోర్ట్స్ క్లబ్‌జింబాబ్వే పర్యటనకు భారత టీ20 జట్టు..శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), శివమ్ దూబే, సూర్యాన్ష్ షెడ్గే, రింకూ సింగ్, హర్ష్ దూబే, వరుణ్ చక్రవర్తి, ప్రిన్స్ యాదవ్, యశ్ ఠాకూర్, అశోక్ శర్మ, మయాంక్ యాదవ్, ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (వికెట్ కీపర్)




# హిట్‌మ్యాన్‌ను పొగడ్తలతో ముంచెత్తిన రవిశాస్త్రి

లార్డ్స్ మైదానంలో ఇంగ్లాండ్‌తో జరిగిన మూడో వన్డే మ్యాచ్ కంటే ముందు టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాడు. 2027 వన్డే ప్రపంచకప్ వైపు చూస్తున్న భారత సెలెక్టర్లు, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్.. రోహిత్ శర్మను ఇకపై జట్టులోకి తీసుకోకపోవచ్చని, లార్డ్స్ మ్యాచ్ అతనికి ఆఖరిది కానుందంటూ వార్తలు వచ్చాయి. అయితే 39 ఏళ్ల రోహిత్ శర్మ ఈ మ్యాచ్‌లో విశ్వరూపం చూపించాడు. వింటేజ్ ఆటతో ఇంగ్లాండ్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. దీంతో తనపై విమర్శలు గుప్పించిన వారి నోళ్లను హిట్ మ్యాన్ మూయించాడు.మైదానం నలుమూలలా బాదుతూ రోహిత్ శర్మ ఆడిన షాట్లు లార్డ్స్ మైదానాన్ని హోరెత్తించాయి. తొలి రెండు వన్డేల్లో 11, 26 పరుగులు మాత్రమే చేసి విఫలమైన రోహిత్, ఆఖరి వన్డేలో అద్భుతంగా పుంజుకున్నాడు. 110 బంతుల్లో 138 పరుగులు స్కోరు చేశాడు. ఇందులో 5 సిక్స్‌లు, 17 ఫోర్లు ఉన్నాయి. ఈ ఇన్నింగ్స్‌పై భారత మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి స్పందించాడు. రోహిత్ శర్మ తనకు తానుగా కొత్తగా నిరూపించుకోవాల్సింది ఏమీ లేదని, తన అద్భుతమైన సెంచరీతో విమర్శకుల నోళ్లను శాశ్వతంగా మూయించేశాడని రవిశాస్త్రి పేర్కొన్నాడు. ఒక ఆటగాడు జట్టుకు అంత సేవ చేసిన తర్వాత ఇలాంటి రూమర్లు రావడం విసుగు కలిగిస్తుందని రవిశాస్త్రి వ్యాఖ్యానించాడు. రోహిత్ శర్మలో ఇంకా ఆడేందుకు కసి ఉన్నన్ని రోజులు అతడికి అవకాశం ఇవ్వాలని.. సెలెక్టర్లను కోరాడు. తనకు ఇక ఆడే సామర్థ్యం లేదని రోహిత్ భావించిన రోజే అతడే స్వయంగా తప్పుకుంటాడని రవిశాస్త్రి స్పష్టం చేశాడు. మరోవైపు తన రీఎంట్రీ ఇన్నింగ్స్ పై రోహిత్ శర్మ బీసీసీఐ అప్‌లోడ్ చేసిన వీడియోలో స్పందించాడు. బయట వచ్చే విమర్శలు, కామెంట్లు తనకు అనవసరమని, మైదానంలోకి వెళ్లి పరుగులు సాధించడమే తన బాధ్యత అని రోహిత్ చెప్పాడు. విమర్శలు లేకపోతే కిక్కు ఉండదని, బయట వారు చేసే పని వారు చేస్తుంటే, మైదానంలో తాను చేయాల్సిన పని తాను చేస్తానని ధీమా వ్యక్తం చేశాడు.

# చలానా కాదు... ప్రాణ రక్షణే ధ్యేయం

- ఉప్పల్ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసులు
- తల ఉంటేనే తలరాత... రూల్ మారినా,రూట్ ఒకటే
- ఉప్పల్ ట్రాఫిక్ ఏసీపీ సంపత్,ఇన్‌స్పెక్టర్ ఎస్హెచ్ఓ నాగరాజు
- ఉప్పల్‌లో ట్రాఫిక్ పోలీసుల వినూత్న ప్రయోగం
- హెల్మెట్ బ్యాంక్ షురూ







**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),జూలై21:** సాధారణంగా రోడ్డుపై హెల్మెట్ లేకుండా కనిపించారా... సడన్‌గా ట్రాఫిక్ సిబ్బంది వచ్చి బండి తాళం తీసేయడం లేదా వెనక నుంచి కెమెరాతో ఫోటో తీసి చలానా బాదడం పరిపాటి.కానీ, మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్ పరిధిలో కథ మారింది జరిమానాలతో జేబులు ఖాళీ చేయడం కాదు...సురక్షిత ప్రయాణంతో జీవితాలు నిలపడమే లక్ష్యంగా ఉప్పల్ ట్రాఫిక్ పోలీసులు ఓ సంచలనాత్మక నిర్ణయానికి శ్రీకారం చుట్టారు.

### ఏమిటీ 'హెల్మెట్ బ్యాంక్'? పని చేసేది ఎలా?

మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి ఐపీఎస్ ఆదేశాల మేరకు,ఉప్పల్ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసులు పర్యవేక్షణలో ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద వినూత్నంగా 'హెల్మెట్ బ్యాంక్' ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...హెల్మెట్ లేకుండా ప్రయాణించే వాహనదారులను ఆపి ఫైన్లు వేయడం కంటే, వారిలో బాధ్యత పెంచడమే మా ఉద్దేశం అని ఆయన అన్నారు.అందుకే ఈ 'హెల్మెట్ బ్యాంక్'ను ప్రారంభించాం అని తెలిపారు.ఇక్కడ వాహనదారుడి గుర్తింపు కార్డు వివరాలు నమోదు చేసుకుని ఉచితంగా హెల్మెట్ ఇస్తాం అని తెలిపారు. మరుసటి రోజు వారు సొంతంగా హెల్మెట్ కొనుగోలు చేసి, ఇక్కడి నుంచి తీసుకెళ్లిన హెల్మెట్‌ను తిరిగి ఇచ్చేయాలి అని సూచించారు.మీ ప్రాణం మీ కుటుంబానికి ఎంతో విలువైనదని గురుతుచేయడమే ఈ వినూత్న ప్రయత్నం అని ఆయన తెలిపారు.

### హెల్మెట్ల పరిశుభ్రతకు పూర్తి ప్రాధాన్యం: ఉప్పల్ ట్రాఫిక్ ఏసీపీ సంపత్

వాహనదారులు తిరిగి అప్పగించిన హెల్మెట్లను వెంటనే ప్రాపర్ గా శానిటైజ్ చేస్తాం.శుభ్రపరిచిన తర్వాతే వాటిని ఇతర వాహనదారులకు వినియోగంలోకి తెస్తాం.హెల్మెట్ వాడకాన్ని ఒక అలవాటుగా మార్చడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం.

### ప్రతి ఒక్కరూ సహకరించాలి: నాగరాజు,ఉప్పల్ ట్రాఫిక్ సీఐ (ఎస్హెచ్ఓ)

ఈ సదుపాయాన్ని వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలి.పోలీస్ శాఖ తీసుకున్న ఈ నిర్ణయంపై నగరవాసుల నుంచి విశేష స్పందన వస్తోంది.ప్రజల భద్రత కోసం ట్రాఫిక్ సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నారు. వాహనదారులు నియమ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలి.

### వాహనదారుల హర్షం పోలీస్ మార్క్ మార్పు:

వాహనదారుల ప్రాణ రక్షణ కోసం పోలీసులు తీసుకున్న ఈ వినూత్న ఆలోచనపై నగరవాసుల నుంచి ప్రశంసల వర్షం కురుస్తోంది.
చలానాల భయంతో తప్పించుకునే వాహనదారుల్లో ఈ విధానం ద్వారా బాధ్యతాయుతమైన మార్పు వస్తుందని డీసీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఆర్ఐ గోవర్ధన్, ఎస్సై లు మధు, పాండు,ఇతర ట్రాఫిక్ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

# షూటింగ్‌లో బాలకృష్ణకు స్వల్ప గాయం



నటసింహం, స్టార్ హీరో నందమూరి బాలకృష్ణ కాకినాడ పోర్ట్ ప్రాంగణంలో జరుగుతున్న తన తాజా చిత్రం 'NBK111' షూటింగ్‌లో ప్రమాదానికి గురయ్యారు. డైరెక్టర్ గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ కోసం కాకినాడ పోర్ట్ పరిసర ప్రాంతాల్లో కొన్ని కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. మంచు మనోజ్‌తో కలిసి ఒక హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తున్న సమయంలో బాలకృష్ణ అనుకోకుండా కాలుజారి కిందపడటంతో ఆయన మోకాలికి స్వల్ప గాయమైంది.

ఈ ప్రమాదం జరిగిన వెంటనే చిత్ర యూనిట్ సభ్యులు షూటింగ్‌ను అక్కడికక్కడే నిలిపివేసి, ఆయనను తక్షణ చికిత్స కోసం సమీపంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలోని వైద్యుల బృందం బాలకృష్ణకు ప్రాథమిక చికిత్స అందించడంతో పాటు అవసరమైన ఇతర వైద్య పరీక్షలను పూర్తి చేసింది. ఈ గాయం చాలా స్వల్పమైనదేనని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు స్పష్టం చేశారు. అయితే, త్వరగా కోలుకోవడానికి కొన్ని రోజుల పాటు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని ఆయనకు వైద్యులు సూచించారు.

'వీరసింహారెడ్డి' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ విజయం తర్వాత బాలకృష్ణ – గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో వస్తున్న రెండవ చిత్రం కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. కాకినాడ షెడ్యూల్‌లో రిస్కీ యాక్షన్ దృశ్యాలను తెరకెక్కిస్తున్న సమయంలో ఈ అనుకోని సంఘటన జరిగిందనే వార్త సోషల్ మీడియాలో వ్యాపించడంతో అభిమానులు, సినీ ప్రముఖులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి పూర్తిగా స్థిరంగా ఉందని, ఆసుపత్రి నుంచి త్వరలోనే డిశ్చార్జ్ అయి తిరిగి కోలుకుంటారని సమాచారం.



# చరణ్ సరసన రష్మిక?..

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, సెన్సేషనల్ డైరెక్టర్ సుకుమార్ కలయికలో రాబోతున్న చిత్రం 'ఆర్‌సీ17' (వర్కింగ్ టైటిల్)పై సినీ వర్గాల్లో అంచనాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. వీరిద్దరి కాంబినేషన్‌లో గతంలో వచ్చిన 'రంగస్థలం' ఇండస్ట్రీ హిట్‌గా నిలవడం, ఆ తర్వాత సుకుమార్ దర్శకత్వంలో 'పుష్ప' ఫ్రాంచైజీ సినిమాలు చరిత్ర సృష్టించడం నేపథ్యంలో... ఈ కొత్త ప్రాజెక్ట్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు తుది దశకు చేరుకున్న ఈ సినిమాని త్వరలోనే సెట్స్ పైకి తీసుకెళ్లేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సినిమాలో హీరోయిన్ ఎవరనే దానిపై ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. మొదట కియారా అద్వానీ పేరు వినిపించినా, తాజాగా నేషనల్ క్రష్ రష్మిక మందన్న పేరు బలంగా వినిపిస్తోంది.

సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన 'పుష్ప' సిరీస్‌తో రష్మిక పాన్-ఇండియా స్థాయిలో స్టార్‌డమ్ సంపాదించుకుంది. ఆ చిత్రంలో ఆమె నటనకు దేశవ్యాప్తంగా ప్రశంసలు దక్కాయి. ఇప్పుడు 'ఆర్‌సీ17' కోసం సుకుమార్ ఒక బలమైన, కథను మలుపు తిప్పే మహిళా పాత్రను రాసుకున్నారని, ఆ పాత్రకు రష్మిక అయితేనే పూర్తి న్యాయం చేయగలదని ఆయన భావిస్తున్నట్లు సమాచారం. ఆమెకున్న పాన్-ఇండియా ఇమేజ్ కూడా సినిమాకు అదనపు ఆకర్షణగా నిలుస్తుందని చిత్రబృందం అంచనా వేస్తోంది. ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కేవలం గ్లామర్ కోసమే కాకుండా కథాగమనంలో అత్యంత కీలకంగా ఉండనుందని తెలుస్తోంది. చరణ్ మాస్ ఇమేజ్, సుకుమార్ టేకింగ్, దానికి రష్మిక నటన తోడైతే బాక్సాఫీస్ వద్ద కొత్త చరిత్ర ఖాయమని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే 'రంగస్థలం'తో రికార్డులు సృష్టించిన ఈ కాంబో, మరోసారి అంతకుమించిన విజయాన్ని అందుకుంటుందని అంచనా వేస్తున్నారు. అయితే, హీరోయిన్ ఎంపికపై చిత్ర యూనిట్ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. మరోవైపు రష్మిక ప్రస్తుతం తన భర్త విజయ్ దేవరకొండతో కలిసి 'రణబాలి' అనే భారీ పీరియాడిక్ యాక్షన్ చిత్రంలో నటిస్తోంది. రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం, 19వ శతాబ్దంలో రాయలసీమలో కరవు సమయంలో బ్రిటిష్ పాలనపై పోరాడిన ఓ యోధుడి కథ ఆధారంగా తెరకెక్కుతోంది. 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' తర్వాత విజయ్-రష్మిక కాంబోలో వస్తున్న మూడో సినిమా కావడంతో దీనిపై కూడా భారీ అంచనాలున్నాయి.



# శ్రీనివాస మంగాపురం నుంచి రావే చెలియా విడుదల


ఘట్టమనేని జయకృష్ణ హీరోగా అజయ్ భూపతి తెరకెక్కిస్తోన్న చిత్రం 'శ్రీనివాస మంగాపురం' రషా థడానీ కథానాయికగా అలరించనున్నారు. జులై 30న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఈ సినిమా నుంచి లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు. రావే చెలియా అంటూ సాగే ఈ పాటలో 'నా ప్రాణం నను వీడి.. నీ వైపే కదిలేనే' అనే లిరిక్స్ యూత్‌ను ఆకట్టుకుంటున్నాయి.

# పంద్రాగస్ట్ పోటీలో సూర్య, నయనతార



తమిళ సినీ పరిశ్రమలో బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోరు జరగనుంది. గతంలో 'గజిని', 'ఆధవన్', 'మాస్సు ఎంగిర మసిలామణి' వంటి చిత్రాల్లో కలిసి నటించిన స్టార్ హీరో సూర్య, లేడీ సూపర్ స్టార్ నయనతార ఇప్పుడు ఒకరికి ఒకరు బాక్సాఫీస్ ప్రత్యర్థులుగా మారబోతున్నారు. సూర్య హీరోగా తెరకెక్కుతున్న 'విశ్వనాథ్ / సన్స్' మరియు నయనతార ప్రధాన పాత్రలో రూపొందుతున్న 'హాయ్ ' చిత్రాలు రెండూ ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్నాయి. దీంతో స్వాతంత్య దినోత్సవ సెలవులను లక్ష్యంగా చేసుకుని ఈ రెండు సినిమాలు నేరుగా పోటీ పడనున్నాయి. మొదట 'విశ్వనాథ్ / సన్స్' చిత్రాన్ని ఆగస్టు 14న విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. అనంతరం నయనతార నటించిన 'హాయ్' మూవీ మేకర్స్ కూడా అదే తేదీని రిలీజ్ డేట్‌గా ప్రకటించడంతో బాక్సాఫీస్ రేసు మరింత ఆసక్తికరంగా మారింది. 'హాయ్' చిత్రానికి లోకేష్ కనగరాజ్ వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన విష్ణు ఏడవన్ దర్శకత్వం వహిస్తున్నారు. రొమాంటిక్ కామెడీగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో కవిన్ హీరోగా నటిస్తుండగా, కె. భాగ్యరాజ్, రాధికా శరత్‌కుమార్, ప్రభు, వీటీవీ గణెళిష్, సత్యన్, అమృత శ్రీనివాసన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని రౌడీ పిక్చర్స్, 7 స్క్రీన్ స్టూడియో, జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. మరోవైపు 'విశ్వనాథ్ / సన్స్' చిత్రంలో సూర్యకు జోడీగా మమితా బైజు నటిస్తున్నారు. కుటుంబ భావోద్వేగాలతో కూడిన హృద్యమైన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపొందుతోంది. ఒకవైపు ఫ్యామిలీ డ్రామాతో సూర్య, మరోవైపు రొమాంటిక్ కామెడీతో నయనతార ప్రేక్షకుల ముందుకు వస్తుండటంతో ఈ రెండు సినిమాల మధ్య బాక్సాఫీస్ పోటీ ఎలా ఉండబోతుందనే ఆసక్తి సినీ అభిమానుల్లో నెలకొంది. స్వాతంత్య్ర దినోత్సవ వీకెండ్‌లో తమిళ సినీ పరిశ్రమలో ఈ క్లాష్ హాట్ టాపిక్‌గా మారింది.

# 'టాక్సిక్' నుంచి రెండో పాట.. యశ్-తారా రొమాన్స్‌తో 'మనసు ఆగదు'!



రాకింగ్ స్టార్ యశ్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్' విడుదలకు సిద్ధమవుతోంది. ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా నుంచి చిత్రబృందం రెండో పాట 'మనసు ఆగదే'ను విడుదల చేసింది. ఇప్పటికే వచ్చిన తొలి పాట 'తబాహి'తో బోల్డ్ రొమాంటిక్ టోన్‌ను చూపించిన మేకర్స్.. ఇప్పుడు రెండో పాటలో అంతకుమించిన రొమాన్స్‌ను ఆవిష్కరించారు. ఈ పాటలో యశ్, బాలీవుడ్ నటి తారా సుతారియా మధ్య కెమిస్ట్రీ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. బాత్‌టబ్‌లో తారా ఎంట్రీ, ఆమెకు యశ్ గన్‌తో ఎంగేజ్‌మెంట్ రింగ్ తొడిగే సీన్, వర్షంలో ఇద్దరి రొమాంటిక్ మూమెంట్స్, కేఫ్‌లో ముద్దులతో సాగే సన్నివేశాలు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. విడుదలైన కొన్ని గంటల్లోనే ఈ పాట సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. లేడీ డైరెక్టర్ గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో నయనతార, కియారా అద్వానీ, రుక్మిణి వసంత్, తారా సుతారియా, హుమా ఖురేషి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతున్న ఈ సినిమాకు విశాల్ మిశ్రా, కనిష్క్ బాగ్చీ సంగీతం అందిస్తుండగా, కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. రెండో పాట విడుదలతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.

# 'ఇరుముడి' డబ్బింగ్ ప్రారంభించిన రవితేజ



రవితేజ హీరోగా శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న 'ఇరుముడి' సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా సాగుతున్నాయి. తాజాగా ఈ చిత్రానికి రవితేజ డబ్బింగ్ ప్రారంభించారు. షూటింగ్‌లో తన భాగాన్ని పూర్తి చేసిన ఆయన స్టూడియోలో డబ్బింగ్ చెబుతున్న వీడియోను చిత్రబృందం విడుదల చేసింది. అందులో "నాకు ఒకే ఒక్క కూతురు... ఆమె పేరు మణెమ్మ" అంటూ రవితేజ చెప్పిన డైలాగ్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఈ వీడియోలో దర్శకుడు శివ నిర్వాణ, బాలనటి నక్షత్ర కూడా కనిపించారు. ప్రస్తుతం చిత్రీకరణ చివరి దశకు చేరుకుంది. మరో మూడు రోజుల షూటింగ్ మాత్రమే మిగిలి ఉన్నట్లు సమాచారం. మరోవైపు జి.వి. ప్రకాశ్‌కుమార్ రీ-రికార్డింగ్ పనులు కూడా ప్రారంభించారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఆగస్టు 21న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఇటీవల విడుదలైన గ్లింప్స్‌లో కూతురిపై అపారమైన ప్రేమ చూపించే తండ్రిగా రవితేజ కనిపించారు. అనూహ్య సంఘటనల తర్వాత మద్యానికి బానిసైన అతడు, కూతురు మాటతో అయ్యప్ప మాల ధరించి జీవితాన్ని మార్చుకునే ప్రయాణం కథలో కీలకంగా ఉండనుంది. రవితేజ కెరీర్‌లో 77వ చిత్రంగా వస్తున్న 'ఇరుముడి'లో భక్తి, భావోద్వేగాలు, కమర్షియల్ అంశాలను సమపాళ్లలో మేళవించినట్లు చిత్రబృందం చెబుతోంది. తండ్రీకూతుళ్ల అనుబంధమే కథకు ప్రధాన బలమని సమాచారం. ఇందులో ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తుండగా, బేబీ నక్షత్ర రవితేజ కూతురి పాత్రలో కనిపించనుంది. సాయికుమార్, అజయ్ ఘోష్, రమేష్ ఇందిర, శ్వాసిక కీలక పాత్రలు పోషిస్తున్నారు.